PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక www.evarthalu.com

మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 7-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 247 Issue: 247

Published from Jagitial
Circulated to Telangana


07 మార్చి 2026 - శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:33 సూర్యాస్తమయం - సా. 6:20 తిథి చవితి రా. 7:21 వరకు తరువాత పంచమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం చిత్తా ఉ. 11:12 వరకు తరువాత స్వాతి యోగం వృద్ధి ఉ. 6:48 వరకు కరణం భాలవ రా. 7:21 వరకు కౌలవ ఉ. 8:10౦ వరకు వర్జ్యం సా. 5:23 నుండి రా. 7:08 వరకు దుర్ముహూర్తం ఉ. 8:08 నుండి ఉ. 8:55 వరకు రాహుకాలం ఉ. 9:30 నుండి ఉ. 10:58 వరకు యమగండం మ. 1:55 నుండి మ. 3:23 వరకు గుళికాకాలం ఉ. 6:33 నుండి ఉ. 8:02 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:57 నుండి తె. 5:45 వరకు అమృత ఘడియలు తె. 3:53 నుండి తె. 5:38 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:03 నుండి మ. 12:50 వరకు




ఏపీలో బ్యాన్..

Social Media

## 13 ఏళ్లలోపు..

### సోషల్ మీడియా నిషేధం

నేటి డిజిటల్ యుగంలో చిన్న పిల్లలు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు బానిసలవుతున్న తీరుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది.పిల్లల మానసిక ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని.. 13 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా వాడకాన్ని నిషేధించే దిశగా అడుగులు వేస్తోంది.

అమరావతి, మార్చి 6 (ఈవార్తలు): ఇప్పటికే కర్నాటక ప్రభుత్వం ఇలాంటి ఆలోచన చేస్తుండగా, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ కూడా అదే బాటలో పయనించనుంది. దీనికి సంబంధించి 90 రోజుల్లో విధివిధానాలు ఖరారు చేస్తామని అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇదే సమయంలో 13 -16 లోపు పిల్లలకు సంబంధించి సోషల్ మీడియా వాడకంపై తరువాయి 2 వ పేజీలో...

కర్ణాటకలో బ్యాన్..

## 16 ఏళ్ల లోపు

### సోషల్ మీడియా నిషేధం

బెంగళూరు: కర్ణాటక ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. 16 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించింది. అసెంబ్లీ సమావేశాల్లో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ప్రకటించారు. మొబైల్ వినియోగంతో కలిగే దుష్ప్రభావాలను సిద్ధరామయ్య ప్రస్తావించారు. పిల్లలపై మొబైల్స్ దుష్ప్రభావం నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. పిల్లలకు సోషల్ మీడియాను దూరం చేయడానికి బ్యాన్ చేసినట్లు సీఎం తెలిపారు. ఆస్ట్రేలియాలో మైనర్లకు సోషల్ మీడియాపై నిషేధం ఉండగా.. ఫిన్లాండ్, యూకే కూడా అమలుకు కసరత్తు చేస్తున్నాయని ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే వెల్లడించారు.

Social Media

ఇండోనేషియాలో బ్యాన్..

## 16 ఏళ్ల లోపు

### సోషల్ మీడియా నిషేధం

జకార్తా: చిన్నపిల్లల మానసిక ఆరోగ్యం మరియు భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇండోనేషియా ప్రభుత్వం ఒక చారిత్రాత్మకమైన అడుగు వేసింది. దేశంలోని 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించకుండా కఠినమైన నిబంధనలను విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం ఆ దేశ సమాచార మరియు డిజిటల్ మంత్రిత్వ శాఖ ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించింది. దీని ప్రకారం, మార్చి 28 నుండి కొత్త నిబంధనలు అధికారికంగా అమలులోకి వస్తాయి. ఈ లోపు సోషల్ మీడియా సంస్థలు తమ ప్లాట్‌ఫారమ్‌లలో వయస్సు నిర్ధారణ ప్రక్రియను కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పిల్లల్లో పెరుగుతున్న సోషల్ మీడియా వ్యసనం, -2 వ పేజీలో...

# వంట గ్యాస్.. ఇండ్లకే!



ఇరాన్ యుద్ధం, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, సప్లయ్ చైన్‌లో ఇబ్బందుల దృష్ట్యా ఎల్పీజీ సరఫరాపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సామాన్య ప్రజలకు ఎక్కడా గ్యాస్ కొరత రాకుండా ఉండేందుకు 'హౌస్‌హోల్డ్ ఫస్ట్' విధానం అమల్లోకి తీసుకొస్తూ ఆదేశాలు జారీ చేసింది. దేశంలోని ప్రధాన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలైన ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సంస్థలకు కేంద్రం ప్రత్యేక మార్గదర్శకాలను పంపింది.

### 'హౌస్‌హోల్డ్ ఫస్ట్' విధానం అమల్లోకి..

### ఎల్పీజీ సరఫరాపై కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ: ఉత్పత్తి అవుతున్న, దిగుమతి చేసుకుంటున్న ఎల్‌పీజీలో మెజారిటీ భాగం గృహ వినియోగదారులకే చేరేలా చూడాలని స్పష్టం చేసింది. సాధారణంగా పండుగల సీజన్, అంతర్జాతీయంగా సరఫరా ఇబ్బందులు తలెత్తినప్పుడు గృహ వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ల కోసం వెయింటింగ్ పీరియడ్ పెరుగుతుంది. ఇలాంటి పరిస్థితులు రాకుండా ముందస్తు జాగ్రత్తగా 'హౌస్‌హోల్డ్ ఫస్ట్' విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. దీంతో సామాన్య ప్రజలకు సకాలంలో సిలిండర్లు అందుతాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.గృహ వినియోగదారులకు గ్యాస్ కొరత లేకుండా చూడటం కోసం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కోటాను నియంత్రించాలనే ఉద్దేశంతో తిరుపతిలోని గ్యాస్ సంస్థలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. అయితే తిరుపతిలో పరిస్థితి వేరుగా ఉంది. తిరుమల శ్రీవారి దర్శనం కోసం నిత్యం వేలాదిమంది తిరుపతికి తరువాయి 2 వ పేజీలో...

## తెలంగాణలో ఎస్ఐఆర్

### మరో 21 రాష్ట్రాల్లో ఓటర్ల ప్రక్షాళన

### నోటిఫికేషన్ జారీ చేసిన ఈసీ




న్యూఢిల్లీ: తెలంగాణాలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్)కు రంగం సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) నోటిఫికేషన్ జారీ చేసింది. నకిలీ ఓటర్లను తొలగించి, ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసేందుకు ఉద్దేశంలో ఎస్ఐఆర్ తీసుకొచ్చింది కేంద్ర ఎన్నికల సంఘం. దీనిలో భాగంగా తెలంగాణతో సహా 22 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌కు నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించి సన్నాహకాలను, శిక్షణా తరువాయి 2 వ పేజీలో...



## సివిల్స్‌లో.. తెలుగు తేజాలు

### సివిల్స్ - 2025 ఫలితాలు విడుదల

- వివిధ కేంద్ర సర్వీసులకు 958 మంది ఎంపిక
- ఆలిండియా టాపర్‌గా అనుజ్ అగ్నిహోత్రి
- సత్తా చాటిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు
- 23వ ర్యాంకు సాధించిన జశ్వంత్ చంద్ర

దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ పరీక్ష-2025 తుది ఫలితాలు ఇవాళ విడుదలయ్యాయి. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ సహా వివిధ కేంద్ర సర్వీసుల కోసం మొత్తం 958 మంది అభ్యర్థులను యూపీఎస్సీ ఎంపిక చేసింది.

న్యూఢిల్లీ: ఈ ఫలితాల్లో అనుజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించి టాపర్‌గా నిలవగా, రాజేశ్వరి సువే రెండో ర్యాంకు, అకన్ష్ ధుల్ మూడో ర్యాంకును కైవసం చేసుకున్నారు. ఈసారి ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందిన అభ్యర్థులు తమ సత్తా చాటారు. దాదాపు 30 మందికి పైగా తెలుగు అభ్యర్థులు సివిల్స్‌లో విజయకేతనం ఎగురవేయడం విశేషం. ముఖ్యంగా ఆల్ ఇండియా 23వ ర్యాంకుతో జీను శ్రీ జస్వంత్ చంద్ర, 55వ ర్యాంకుతో గుడెల్లి సృజన తరువాయి 2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము- 24 క్యారెట్స్): | రూ.16,113 |
| వెండి (గ్రాము): | రూ.290 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,315 |

## బీసీలకు మళ్లీ మోసం

### రాజ్యసభ రెండు సీట్లలోనూ అన్యాయం: ఎంపీ ఆర్ కృష్ణయ్య



బీసీలకు మంత్రివర్గంలో అన్యాయం జరిగిందని, కనీసం రాజ్యసభలో బీసీలకు చోటు కల్పించకపోవడం దురదృష్టకరమని ఎంపీ ఆర్ కృష్ణయ్య అన్నారు. బీసీ విద్యార్థి సంఘం పగిళ్ల సతీశ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. లక్డికాపుల్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ఆందోళన చేపట్టారు.

హైదరాబాద్, మార్చి 6 (ఈవార్తలు): ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. పేద కులాలు ఉన్నత చదువులు చదవడం సీఎం రేవంత్ రెడ్డికి ఇష్టం లేదని ఆరోపించారు. కాంట్రాక్టర్లకు వేల కోట్లు బిల్లు చేస్తున్నారు కానీ.. రీయింబర్స్ మెంట్ విడుదల చేయడానికి మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆగ్రహం తరువాయి 2 వ పేజీలో...

## కూల్చివేతలు తప్పవు

### అభివృద్ధి కావాలంటే భూమి కోల్పోవాల్సిందే.. కూల్చివేతలపై సీఎం రేవంత్ రెడ్డి

అభివృద్ధి కావాలంటే కొంతమంది భూములు కోల్పోక తప్పదని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కూల్చివేతలు జరుగుతుండగా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్ల తీవ్ర నిరసనలు, ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.




హైదరాబాద్, మార్చి 6 (ఈవార్తలు): కష్టపడి కట్టుకున్న పేదల ఇళ్లను కూల్చేస్తున్నారంటూ తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ నగరంలో ఆక్రమణల కూల్చివేతకు కాంగ్రెస్ సర్కార్ ఏర్పాటు చేసిన హైడ్రా.. గత కొన్ని నెలలుగా అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపుతోంది. అటు.. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో భాగంగా నదీ పరివాహక ప్రాంతంలో కూడా కొన్ని నిర్మాణాలు కూల్చివేస్తున్నారు. మరోవైపు.. ఖమ్మంలో ఇటీవల భూదాన్ భూముల్లో కూల్చివేతలపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ క్రమంలోనే తాజాగా తరువాయి 2 వ పేజీలో...


### విశ్వవాణి



కళ్లు లేని తన భార్యకు పూల అందాలను, పరిమళాలను తెలియజేసేందుకు జపాన్‌కు చెందిన ఓ భర్త రెండేళ్ల పాటు కష్టపడి పూల మొక్కలను పెంచాడు. ఆమె ఆ పూల మొక్కలు వెదజల్లే సువాసనలను పీల్చి వాటి అందాలను ఆస్వాదిస్తోంది.



ఇజ్రాయెల్, అమెరికాతో పోరులో భాగంగా ఇరాన్ డెకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు సమాచారం. శత్రు దేశాలను మోసగించేందుకు గ్రౌండ్లలో, ఖాళీ ప్రదేశాల్లో ఫైటర్ జెట్ల పెయింటింగ్స్ వేస్తున్నట్లు తెలుస్తోంది. అది నిజమని నమ్మి.. అమెరికా బలగాలు క్షిపణిని వదిలి మోసపోయాయని ఇరాన్ మీడియా తెలిపింది. పై చిత్రం అందుకు ఉదాహరణ అని పేర్కొంది.



2

## రక్తం పారిస్తా

### ఇరాన్‌కు ఇంకో దారి లేదు

### ఊచకోత ఆపే ప్రసక్తే లేదు

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్

## 9 కోట్ల కిసాన్ ఐడీలు

ప్రధాని మోదీ



2




2

## ఫ్లిప్‌కార్ట్‌లో 500 మందిపై వేటు!

ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ తన వార్షిక పనితీరు సమీక్షలో భాగంగా సుమారు 400 నుంచి 500 మంది ఉద్యోగులపై వేటు వేసింది. ఈ తొలగింపులు కంపెనీ మొత్తం ఉద్యోగుల సంఖ్యలో 3 నుంచి 4 శాతంగా ఉన్నాయి.

## వార్తా చానళ్లకు టీఆర్పీ కట్ బార్క్‌కు కేంద్రం ఆదేశం

2

## రాశి ఫలాలు

7.3.2026

మేషం: గృహమున కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. చిన్ననాటి మిత్రులతో సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపారాలలో ఆర్థిక పురోగతి సాధిస్తారు. వృత్తి ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

వృషభం: కుటుంబ సభ్యులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహ పరుస్తాయి. ప్రారంభించిన పనులు మందకొడిగా సాగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వేస్తారు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. సహోద్యోగులతో వివాదాలుంటాయి.

మిధునం: ఆధ్యాత్మిక కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. చేపట్టిన పనులలో అవరోధాలు కలుగుతాయి. ఇంటా బయట శ్రమాధిక్యత పెరుగుతుంది. వ్యాపారాలు వ్యవహారాలు మందగిస్తాయి.

కర్కాటకం: చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలలో సన్నిహితుల సహాయం లబిస్తుంది. ఉద్యోగమున మీ పనితీరుతో అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. కుటుంబ సభ్యులతో సేవాకార్యక్రమాలు పాల్గొంటారు.

సింహం: ఆర్థికంగా అవసరానికి ధనం లభించక ఇబ్బంది పడతారు. నూతన ఋణ ప్రయత్నాలు చేయవలసి వస్తుంది. సన్నిహితులతో మాటపట్టింపులు ఉంటాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలు మరింత బాధిస్తాయి. వ్యాపారాలు నత్తనడకగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాల్లో అదనపు బాధ్యతల వలన విశ్రాంతి ఉండదు.

కన్య: చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. భూ సంభందిత క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. వృత్తి వ్యాపారాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. కుటుంబ సభ్యుల నుండి ఆకస్మి ధనలాభం పొందుతారు. నిరుద్యోగులకు నూతన అవకాశములు లభిస్తాయి.

తుల: దీర్ఘకాలిక ఒత్తిడి పెరుగుతుంది. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. వ్యాపార వ్యవహారాలలో అలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. ఇంటా బయట కొందరి ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో ప్రయత్నాలు కలిసిరావు. చిన్ననాటి మిత్రులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు.

వృశ్చికం: గృహమునకు చిన్ననాటి మిత్రుల రాక ఆనందం కలిగిస్తుంది. సోదరులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. సమాజంలో పెద్దలతో పరిచయాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో కీలక సమాచారం సేకరిస్తారు. ఉద్యోగాలలో మరింత అనుకూల పరిస్థితులుంటాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి.

ధనస్సు: ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. నిరుద్యోగ యత్నాలు వేగవంతం చేస్తారు. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. వృత్తి వ్యాపారాలు లాభాలబాట పడుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతల నుండి ఉపశమనం పొందుతారు.

మకరం: జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్ర దర్శనం చేసుకుంటారు. వృధా ఖర్చులు పెరుగుతాయి. ముఖ్యమైన పనులు వాయిదా పడుతాయి. ఆరోగ్య విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. వృత్తి వ్యాపారాలలో ఊహించని సమస్యలు ఎదురవుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహ పరుస్తాయి.

కుంభం: దూరపు బంధువులతో స్వల్ప విభేదాలు ఉంటాయి. వ్యాపారమున నూతన పెట్టుబడుల విషయంలో పునరాలోచన చెయ్యడం మంచిది. చేపట్టిన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆకస్మికంగా కొన్ని నిర్ణయాలు మార్చుకుంటారు. విద్యార్థులు పోటీపరీక్షలలో మరింత కష్టపడాలి.

మీనం: వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. ఆర్థిక వాతావరణం అనుకూలిస్తుంది. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. నూతన వస్తు వాహన లాభాలు పొందుతారు. సోదరుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి.

# కూల్చివేతలు తప్పవు

మొదటి పేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రంలో జరుగుతున్న కూల్చివేతలపై పరోక్ష వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ కొత్వాల్‌గూడలోని బుద్వేల్ లే అవుట్ ఇంటర్‌ఛేంజ్ శంకుస్థాపన.. ఎకో హిల్ పార్కు ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి.. కీలక వ్యాఖ్యలు చేశారు. మూసీ నదిలో.. మూసీ పరివాహక ప్రాంతంలో చెత్త భారీగా పేరుకుపోయిందని పేర్కొన్నారు. అలాంటి చెత్త వాతావరణంలో ఉండాలని ప్రజలు ఎవరూ కోరుకోరని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే.. కొంతమంది భూములు కోల్పోవాల్సి ఉంటుందని వెల్లడించారు. అయితే అభివృద్ధి కోసం చేపట్టే కూల్చివేతల విషయంలో తమ ప్రభుత్వం ఎవరికీ అన్యాయం చేయదని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. అందరితో మాట్లాడామని పేర్కొన్న ముఖ్యమంత్రి.. అందరినీ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కూల్చివేతలు, అభివృద్ధి విషయంలో ప్రజలు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని రేవంత్ రెడ్డి వెల్లడించారు. భారతదేశంలోనే మన హైదరాబాద్ కంటే మంచి సుందరమైన నగరం ఇంకొకటి లేదని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎకో హిల్ పార్కును ఎంతో అందంగా తీర్చిదిద్దారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. రాష్ట్రంలో మంచి ప్రభుత్వాలు ఉంటే.. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంతో పోటీ పడేలా చేయొచ్చని పేర్కొన్నారు. తెలంగాణను, హైదరాబాద్‌ను తమ కాంగ్రెస్ సర్కార్ అభివృద్ధి చేస్తుంటే.. రాష్ట్రాన్ని బాగు చేస్తుంటే గతంలో పాలన చేసిన నేతలు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు గుప్పించారు. 10 ఏళ్లలో గత పాలకులు ఏమీ చేయలేదు కాబట్టే.. ఇప్పుడు తమను కూడా అభివృద్ధి చేయకుండా అడ్డుకుంటున్నారని వెల్లడించారు. అలాంటి వారికి తెలంగాణ ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. మన నగరం ఎలా ఉండాలి అనే దానిపై ఇప్పటికే.. తాము అన్ని రకాల ప్రణాళికలు తయారు చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు.



# 9 కోట్ల కిసాన్ ఐడీలు: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: వ్యవసాయ రంగంలో సాంకేతికతను పెంచుతున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. వ్యవసాయంలో సాంకేతికత ప్రాముఖ్యతను వివరిస్తూ.. కిసాన్ ఐడీ ద్వారా ఇప్పటివరకు 9 కోట్ల మంది రైతులను డిజిటల్ నెట్‌వర్క్‌లో చేర్చామని పేర్కొన్నారు. దాదాపు 30 కోట్ల భూముల డిజిటల్ సర్వే పూర్తయిందని, భారత్ విస్తార్ వంటి ఏఐ ఆధారిత ప్లాట్‌ఫారమ్‌లు పరిశోధనా సంస్థలకు, రైతులకు మధ్య వారధిగా మారుతున్నాయని చెప్పారు. అలాగే, గ్రామీణ మహిళల సాధికారత కోసం చేపట్టిన లఖ్‌పతి దీదీ అభియాన్ విజయవంతమైందని, 2029 నాటికి మరో 3 కోట్ల మంది మహిళలను లఖ్‌పతి దీదీలుగా మార్చడమే లక్ష్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హిమాలయ రాష్ట్రాల్లో టెంపర్డ్ నట్ పంటలను ప్రోత్సహించేందుకు బడ్జెట్‌లో ప్రత్యేక ప్రతిపాదనలు చేర్చామని, దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఎగుమతులపై ఆధారపడ్డ ఉత్పత్తి పెరగడం వల్ల ప్రాసెసింగ్, వాల్యూ అడిషన్ రంగాల్లో కొత్త అవకాశాలు వస్తాయని ఈ సందర్భంగా ఆయన వివరించారు. వ్యవసాయ నిపుణులు, పరిశ్రమలు, రైతులు సమన్వయంతో పనిచేస్తేనే భారత వ్యవసాయ రంగాన్ని ప్రపంచ స్థాయి పోటీకి సిద్ధం చేయగలమని, క్వాలిటీ బ్రాండింగ్, అంతర్జాతీయ ప్రమాణాల సాకారం కోసం అందరూ కలిసి మేధోమథనం చేయాలని ఆయన సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య స్పృహ పెరుగుతున్న నేపథ్యంలో, రసాయన రహిత సాగుకు పెద్దపీట వేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌కు చేరువ కావచ్చని, దీని కోసం అవసరమైన సర్టిఫికేషన్, ల్యాబొరేటరీ సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. కేవలం ఒకే రకమైన పంటపై ఆధారపడటం రైతులకు నష్టదాయకమని, అందుకే పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలని ఆయన కోరారు. అలాగే, నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్, పప్పు ధాన్యాల సాగు ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే పశు సంవర్ధక రంగంలో విప్లవాత్మక మార్పుల గురించి ప్రస్తావిస్తూ, పశువులకు వ్యాధుల నుంచి రక్షణ కల్పించేందుకు ఇప్పటికే 125 కోట్లకు పైగా వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేసినట్లు ప్రధాని తెలిపారు. గోబర్ధన్ యోజన ద్వారా గ్రామాల్లో వ్యర్థాల నుంచి ఆదాయాన్ని సృష్టించవచ్చని, పాలు, పేడ ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ వ్యవసాయ బడ్జెట్‌లను జిల్లా స్థాయి వరకు పటిష్టంగా అమలు చేయాలని, కేటాయించిన ప్రతి రూపాయి రైతు సంక్షేమానికి సద్వినియోగం అయ్యేలా చూడాలని ప్రధాని సూచించారు.

# వంట గ్యాస్ ఇండ్లకే!

మొదటి పేజీ తరువాయి

వస్తుంటారు. దీంతో ఆధ్యాత్మికంగానే కాకుండా పర్యాటకంగానూ తిరుపతి అభివృద్ధి చెందుతోంది. దీంతో తిరుపతివ్యాప్తంగా తోపుడు బండ్లు, హోటళ్లు అనేకం వెలిశాయి. తోపుడు బండ్లు మొదలుకొని స్టార్ హోటల్స్ వరకూ లెక్కగడితే వీటి సంఖ్య మూడు వేల వరకూ ఉండొచ్చని అంచనా. వీటి నిర్వహణ కోసం ప్రతి నెలా 40 వేల వరకూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు అవసరం అవుతాయని అంచనా. అయితే ఇప్పుడు కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిపివేయాలని గ్యాస్ సంస్థలు నిర్ణయించిన నేపథ్యంలో హోటల్ యజమానులతో పాటుగా.. తిరుపతికి వచ్చే భక్తులు కూడా ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయి. దీంతో భక్తులకు ఆహార పదార్థాలు అందుబాటులో లేకుండాపోయే ప్రమాదం ఉంది. అలాగే ఆహార పదార్థాల ధరలకు కూడా రెక్కలు వచ్చే అవకాశాలు ఉన్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు గ్యాస్ సంస్థల నిర్ణయంతో తిరుపతిలో గ్యాస్ బుకింగ్స్ పెరిగినట్లు తెలిసింది. హోటల్స్ యజమానులు తెల్లవారుజామునుంచే గ్యాస్ ఏజెన్సీల వద్ద క్యూ కట్టారు.

### చమురు ధర 150 డాలర్లు అయ్యే చాన్స్

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కోలుకోలేని దెబ్బ తీసేలా కనిపిస్తోంది. గల్ఫ్ దేశాల నుండి చమురు సరఫరా నిలిచిపోతే, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర బ్యారెల్‌కు 150 డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ.13,783)కు చేరుకోవచ్చని ఖతార్ ఇంధన శాఖ మంత్రి సాద్ అల్-కాబీ హెచ్చరించారు. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల వల్ల తాము అంగీకరించిన ఒప్పందాల ప్రకారం చమురు సరఫరా చేయలేమని గల్ఫ్ దేశాలు ప్రకటించే అవకాశం ఉందని కాబీ తెలిపారు. 'యుద్ధం ఇలాగే కొనసాగితే, రాబోయే కొద్ది రోజుల్లో ఎగుమతిదారులు అందరూ తమ చేతులెత్తేయక తప్పదు. చట్టపరమైన బాధ్యతల నుండి తప్పుకోవడానికి ఇది తప్ప వారికి మరో మార్గం లేదు' అని తెలిపారు.

### ఖతార్ ఎల్ఎన్‌జీ ప్లాంట్‌పై దాడి

ప్రపంచంలోనే రెండో అతిపెద్ద లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ సరఫరాదారు అయిన ఖతార్ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఖతార్‌లోని అతిపెద్దదైన రాస్ లఫాన్ ఎల్ఎన్‌జీ ప్లాంట్‌పై ఇరాన్ డ్రోన్ దాడి చేసింది. ఈ దాడి కారణంగా జరిగిన నష్టాన్ని ఖతార్ ఎనర్జీ ఇంకా అంచనా వేస్తోంది. మరమ్మతులు పూర్తి కావడానికి ఎంత సమయం పడుతుందో ఇప్పుడే చెప్పలేమని మంత్రి వెల్లడించారు. యుద్ధం ఇప్పుడే ఆగిపోయినా, తిరిగి ఎగుమతులు సాధారణ స్థితికి రావడానికి వారాలు లేదా నెలలు పట్టవచ్చు. ఖతార్‌కు ఉన్న 128 ఎల్ఎన్‌జీ నౌకలలో ప్రస్తుతం కేవలం 6 లేదా 7 మాత్రమే సరుకును లోడ్ చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. మిగిలినవన్నీ వివిధ ప్రాంతాల్లో చెల్లాచెదురుగా ఉండిపోయాయి. దాడుల ముప్పు పొంచి ఉండటంతో కేవలం 24 గంటల్లోనే 9,000 మంది ఉద్యోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



# బీసీలకు మళ్లీ మోసం

మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ ఉద్యమం తరహాలో మరో ఉద్యమానికి విద్యార్థి లోకం సిద్ధంగా ఉందని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణ్ కుమార్, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్, బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఎస్ఐఆర్

మొదటి పేజీ తరువాయి

కార్యక్రమాలను కూడా ఇప్పటికే చేపట్టింది. ఈసీఐ ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీ. సుదర్శన్ రెడ్డి శిక్షణ కార్యక్రమాలను చేపట్టిన సంగతి తెలిసిందే.

# వార్తా చానళ్లకు టీఆర్పీ కట్.. బార్క్‌కు కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై కొన్ని టీవీ ఛానళ్లు సంచలనం పేరుతో అందిస్తున్న ఊహాజనిత కథనాలపై కేంద్రం తీవ్రంగా స్పందించింది. దేశంలోని అన్ని వార్తా ఛానళ్లకు టెలివిజన్ రేటింగ్ పాయింట్స్ (టీఆర్పీ) ఇవ్వడాన్ని తక్షణమే నిలిపివేయాలని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఈ మేరకు రేటింగ్ ఏజెన్సీ అయిన 'బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్' (బార్క్) కు స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. కనీసం నాలుగు వారాల పాటు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ రేటింగ్‌లను నిలిపివేయాలని కేంద్రం స్పష్టం చేసింది. ఇరాన్, అమెరికా- ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం పశ్చిమాసియానే కాదు, యావత్ ప్రపంచాన్ని కలవరపెడుతోంది. యుద్ధ పరిణామాలను కవర్ చేస్తున్న కొన్ని టీవీ ఛానెళు శృతి మించి వ్యవహరిస్తున్నాయని కేంద్రం గుర్తించింది. రేటింగ్‌ల కోసం యుద్ధాన్ని ఒక సినిమా తరహాలో, గ్రాఫిక్స్‌తో భయానకంగా చూపిస్తున్నాయని ప్రభుత్వం గమనించింది. దీంతో చర్యలకు ఉపక్రమించింది. 2014 నాటి 'టెలివిజన్ రేటింగ్ ఏజెన్సీల పాలసీ గైడ్‌లైన్స్'లోని క్లాజ్ 24.2 నిబంధన ప్రకారం ప్రభుత్వం ఎప్పుడైనా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రేటింగ్ ఏజెన్సీలకు ఆదేశాలు జారీ చేయవచ్చు. 'ప్రస్తుతం కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో కొన్ని టీవీ ఛానళ్లు అనవసరమైన సంచలనాత్మకత, ఊహాజనిత అంశాలను ప్రసారం చేస్తున్నాయి. ఇటువంటి కథనాలు సాధారణ ప్రజల్లో, ముఖ్యంగా ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న వారు లేదా ఆ ప్రాంతాల్లో స్నేహితులు, కుటుంబ సభ్యులను కలిగిన వారిలో భయాందోళనలు కలిగించే అవకాశం ఉంది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వార్తా ఛానళ్లకు సంబంధించిన టీఆర్పీ ఇవ్వడం నాలుగు వారాల పాటు కానీ, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు కానీ తక్షణమే నిలిపివేయాలి' అని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పేర్కొంది.

# 13 ఏళ్లలోపు..

## సోషల్ మీడియా నిషేధం

మొదటి పేజీ తరువాయి

త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ అంశంపై టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ఇప్పటికే పార్లమెంటులో ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టారు. చిన్న పిల్లల్లో పెరుగుతున్న సోషల్ మీడియా వ్యసనాన్ని అరికట్టడానికి జాతీయ స్థాయిలో చట్టం రావాలని ఆయన ఆకాంక్షించారు. చిన్న వయస్సులోనే సోషల్ మీడియాకు అలవాటు పడటం వల్ల పిల్లల్లో ఏకాగ్రత తగ్గడం, నిద్రలేమి, డిప్రెషన్ వంటి సమస్యలు వస్తున్నాయి. మొబైల్ ఫోన్లలో గంటల తరబడి గడపడం వల్ల విద్యార్థులు తమ చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నారు. వడపోత లేని సోషల్ మీడియాలో పిల్లలు హానికరమైన, హింసాత్మకమైన కంటెంట్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. తెలియని వ్యక్తులతో పరిచయాలు, సైబర్ బుల్లింగ్ వంటివి పిల్లల భద్రతకు ముప్పుగా మారుతున్నాయి. కాగా పిల్లల్లో మొబైల్ వ్యసనాన్ని అరికట్టడం ద్వారా వారిని తిరిగి ఆటపాటలు, పుస్తక పఠనం వైపు మళ్లించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే దీనిపై విద్యావేత్తలు, మనస్తత్వ నిపుణులతో చర్చించి అధికారికంగా మార్గదర్శకాలు విడుదల చేసే అవకాశం ఉంది.

# 16 ఏళ్ల లోపు

## సోషల్ మీడియా నిషేధం

మొదటి పేజీ తరువాయి

సైబర్ బుల్లింగ్, ఇతర మానసిక ఆరోగ్య సమస్యలను అరికట్టడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం అని తెలిపింది. ఈ లెక్కన 16 ఏళ్ల లోపు పిల్లలు టిక్‌టాక్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, రోబ్లాక్స్ వాడటం చట్టరీత్యా నేరం.

# తెలుగు తేజాలు

మొదటి పేజీ తరువాయి

(పెద్దపల్లి జిల్లా) ఉభయ తెలుగు రాష్ట్రాల్లో టాప్ ర్యాంకర్లుగా నిలిచారు. వీరిద్దరూ ప్రస్తుతం తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతుండటం గమనార్హం. ఇక ఇతర తెలుగు అభ్యర్థుల్లో పోలవరపు ధ్వనీష్ (108), అట్ల తరుణ్ తేజ (123), శ్రీగిరిరాజు వి.పి.ఎస్. సాయి కృష్ణ (125), కొలిపాక శ్రీకృష్ణ సాయి (150), బానోత్ లక్ష్మి రచన (178), ఎస్. వర్షిత్ రెడ్డి (259), మాసమ్మగారి పవన్ కుమార్ రెడ్డి (297) మంచి ర్యాంకులు సాధించారు. అలాగే వెలిమినేటి విక్రమ్ సింహా రెడ్డి (541), గుమ్మల శ్వేత (573), వెలిమినేటి విజయసింహ రెడ్డి (682), పుదారి రాహుల్ (748), కత్తిమాని అనిరుధ్ (786), కొరపోతుల శ్రీకర్ రాజు (806), ఇస్లావత్ శ్రీరామ్ హర్ష (823), కట్టా ప్రత్యూష (908), రాజశేఖర్ గోగుల (920), గుగోలత్ జితేందర్ నాయక్ (939) కూడా విజేతల జాబితాలో నిలిచారు.

# ఫ్లిప్‌కార్ట్‌లో 500 మందిపై వేటు!

న్యూఢిల్లీ: ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ తన వార్షిక పనితీరు సమీక్షలో భాగంగా సుమారు 400 నుంచి 500 మంది ఉద్యోగులపై వేటు వేసింది. ఈ తొలగింపులు కంపెనీ మొత్తం ఉద్యోగుల సంఖ్యలో 3 నుంచి 4 శాతంగా ఉన్నాయి. సాధారణంగా ఫ్లిప్‌కార్ట్ ప్రతి సంవత్సరం పనితీరు సరిగ్గా లేని 1 నుంచి 2 శాతం మంది ఉద్యోగులను తొలగిస్తుంది. కానీ, ఈ ఏడాది ఆ సంఖ్య రెట్టింపు (3-4%) కావడం గమనార్హం. ఈ ఏడాది పర్ఫార్మెన్స్ ఇంప్రూవ్‌మెంట్ ప్లాన్ కింద ఉంచిన ఉద్యోగుల సంఖ్య కూడా సాధారణం కంటే ఎక్కువగా ఉంది. తక్కువ రేటింగ్ వచ్చిన వారిని కంపెనీ ఇంటికి సాగనంపింది. లేఆఫ్స్‌లపై కంపెనీ స్పందిస్తూ.. 'రెగ్యులర్ పర్ఫార్మెన్స్ రివ్యూలో భాగంగానే కొంతమంది ఉద్యోగులు సంస్థ నుంచి వైదొలుగుతున్నారు. ప్రభావితమైన ఉద్యోగులకు అవసరమైన మద్దతును అందిస్తున్నాం' అని పేర్కొంది.

# రక్తం పారిస్తా:ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై తన కఠిన వైఖరిని మరోసారి స్పష్టంగా ప్రకటించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఇరాన్‌తో ఎలాంటి రాజీ చర్చలు జరపబోమని, అమెరికా అంగీకరించేది ఒక్కటే.. పూర్తి లొంగుబాటు అని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఫిబ్రవరి 28 నుంచి ప్రారంభమైన ఘర్షణల నేపథ్యంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అమెరికా యుద్ధ లక్ష్యాలపై ఇప్పటివరకు వచ్చిన అత్యంత స్పష్టమైన ప్రకటనగా భావిస్తున్నారు. ట్రంప్ తన సందేశంలో, "ఇరాన్‌తో ఎలాంటి ఒప్పందం ఉండదు. పూర్తి లొంగుబాటు తప్ప మరే ఎంపిక లేదు" అని స్పష్టం చేశారు. ఇదే కాకుండా, యుద్ధం ముగిసిన తర్వాత ఇరాన్‌లో కొత్త నాయకత్వం ఏర్పడాలని కూడా ఆయన సూచించారు. చేశారు. అమెరికా, తన మిత్రదేశాలు కలిసి ఇరాన్‌ను మళ్లీ అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఆర్థికంగా బలమైన దేశంగా తిరిగి నిలబెట్టేందుకు సహకరిస్తామని చెప్పారు. 'ఇరాన్‌ను మళ్లీ గొప్ప దేశంగా మార్చుదాం' అనే నినాదాన్ని ఉపయోగించారు. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ స్పందించింది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్





# వైభవంగా రాజన్న లగ్గం

### పట్టు వస్త్రాలు సమర్పించిన ఆది

### భారీగా తరలివచ్చిన భక్తులు

వేములవాడ, మార్చి 6 (ఈవార్తలు): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి సన్నిధిలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. శివనామస్మరణ, వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన ఈ వేడుక భక్తులకు నేత్రపర్వంగా నిలిచింది. రాజన్న ఆలయ పార్కింగ్ ప్రాంగణంలోని శివార్చన వేదికపై ఏర్పాటు చేసిన కల్యాణ వేదికలో శివపార్వతులు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించబడి భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ధ్వజారోహణం నిర్వహించి వృషభేశ్వరుడికి కల్యాణం జరిపించిన అనంతరం శూలానికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 11:40 గంటలకు అభిజిత్ లగ్న సుముహూర్తంలో ఆలయ ప్రధాన అర్చకులు నమిలికొండ ఉమేశశర్మ, ఈశ్వరగారి సురేష్, ఉప ప్రధానాచార్యులు చంద్రగిరి శరత్, నమిలికొండ రాజేశ్వర శర్మ గోపన్నగారి గణేష్‌తోపాటు ఆస్థాన వేద పండితులు కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయం తరపున ఈవో రమాదేవి, మున్సిపాలిటీ తరపున చైర్‌పర్సన్ పుల్కంరాజు, వైస్ చైర్మెన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు ఆది దంపతులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈశ్వరగారి సురేష్–నాగలక్ష్మి దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి శివపార్వతుల కల్యాణాన్ని కనులారా వీక్షించారు. కల్యాణం జరుగుతున్నంతసేపు శివపార్వతులు తలంబ్రాలు పోసుకుంటూ భక్తులకు ఆనందాన్ని పంచగా, జీలకర్ర బెల్లం ఉంచుకుని దేవుడికి సమర్పితులయ్యారు. కల్యాణ వేడుకల్లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. శివకల్యాణం సందర్భంగా దేవాలయం తరపున పార్కింగ్ ప్రాంగణంలోని చలువ పందిళ్ల కింద భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు.




## ఇంజినీరింగ్ ఫీజులు ఖరారు

### రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల

హైదరాబాద్, మార్చి 6 (ఈవార్తలు): తెలంగాణలోని ప్రైవేట్ అన్–ఎయిడెడ్ ప్రొఫెషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో అండర్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కోర్సులకు సంబంధించిన ఫీజుల నిర్మాణాన్ని ప్రభుత్వం అధికారికంగా ఖరారు చేసింది. 2025–26 విద్యా సంవత్సరం నుంచి 2027–28 వరకు వర్తించే ఈ కొత్త ఫీజులపై ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా జీవో నెం.06తో ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, తాజాగా నిర్ణయించి ఫీజులు 2025–26 నుంచి 2027–28 విద్యా సంవత్సరానికి వర్తించనున్నాయి. తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ సమర్పించిన సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ ఫీజులను నిర్ణయించింది. ఖరారు చేసిన ట్యూషన్ ఫీజులో అడ్మిషన్ ఫీజు, ఇతర ప్రత్యేక ఫీజులు కలవని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన అనుబంధ జాబితా ప్రకారం చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రూ.1,83,000, వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో రూ.1,75,000, మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రూ.1,67,000, సీవీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో రూ.1,63,00, వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇన్‌స్టిట్యూట్: రూ.1,59,600, బీవీరాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రూ.1,46,600గా నిర్ణయించారు. అదేవిధంగా రాష్ట్రంలోని పలు సాధారణ ఇంజినీరింగ్ కళాశాలలకు ఏడాదికి కనీస ఫీజుగా రూ.45 వేలుగా ప్రభుత్వం ఖరారు చేసింది. ఫీజుల వసూలు విషయంలో ప్రభుత్వం పలు మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అదనంగా క్యాపిటేషన్ ఫీజు లేదా డొనేషన్ల రూపంలో ఎలాంటి వసూళ్లకు పాల్పడకూడదని పేర్కొంది. వార్షిక ట్యూషన్ ఫీజును ఒకేసారి లేదా వాయిదాల పద్ధతిలో అడ్వాన్స్‌గా వసూలు చేసుకోవచ్చు. కళాశాలలు సమర్పించిన వివరాల ఆధారంగా ప్రస్తుతం ఫీజులు నిర్ణయించినప్పటికీ, భవిష్యత్తులో భౌతిక తనిఖీల్లో ఏవైనా తప్పుడు వివరాలు ఉన్నట్లు తేలితే ఫీజులను సవరించడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.

## టీజీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ

వరంగల్, మార్చి 6 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణను నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎర్రబెల్లి స్వర్ణకు ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో ఆమె వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా పని చేశారు. 2002లో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికైన ఎర్రబెల్లి స్వర్ణ, నగరానికి మొట్టమొదటి మహిళా మేయర్‌గా సేవలు అందించారు. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా కూడా గతంలో బాధ్యతలు నిర్వర్తించారు. ఎర్రబెల్లి స్వర్ణను రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా నియమించడంతో కాంగ్రెస్ శ్రేణులు హర్షం

# 99 డేస్.. ప్రచార పండుగనే!

### గతంలో ఇచ్చిన దరఖాస్తులే చెత్తబుట్టలో పాలన గాలికి.. పబ్లిసిటీ పాకులాట

**రేవంత్ సర్కారుపై హరీశ్ మండిపాటు**

హైదరాబాద్, మార్చి 6 (ఈవార్తలు): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'పై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ కేవలం ఉత్తి దండగ ప్రచార పర్వమని, ఇది ప్రజలను మభ్యపెట్టే మరో నాటకమని ఆయన ఎద్దేవా చేశారు. దాదాపు 800 రోజుల పాలనలో (రెండున్నరేళ్లు) చేసిందేమీ లేక, ఇప్పుడు ప్రజల దృష్టిని మరల్చేందుకే రేవంత్ రెడ్డి సర్కార్ ఈ కొత్త డ్రామాకు తెరతీసిందని ఆరోపించారు. గతంలో రెండుసార్లు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి స్వీకరించిన లక్షలాది దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోక ఇంకా చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని హరీశ్ రావు విమర్శించారు. ఆ దరఖాస్తులకే దిక్కులేదని, ఇప్పుడు మళ్లీ పది వారాల పాటు పది రకాల కార్యక్రమాలంటూ ప్రజలను మోసం చేయడం సిగ్గుచేటన్నారు. అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు, పాలనా వైఫల్యాలు, కోట్లు కొల్లగొట్టేందుకు చేసిన స్కాముల నుంచి తప్పించుకునేందుకే ఈ 'డైవర్షన్ ప్లాన్' రచించారని మండిపడ్డారు. మీ పాలనలో సగం కాలం పూర్తయినా ఇంకా ఎన్ని రోజులు ప్రచారాలతో నెట్టుకొస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతుల దయనీయ స్థితిని ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. పంట కోతల సమయం వచ్చినా ఈ సీజన్ రైతు భరోసా ఇవ్వలేదని, గత సీజన్ పంట బోనస్ ఎగ్గొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం యూరియా కూడా సరఫరా చేయలేక అన్నదాతలను నడిరోడ్డు మీదకు ఈడ్చారని, నమ్మించి గొంతుకోసిన ఈ మోసాల గురించి ఇప్పుడు గ్రామసభల్లో రైతులకు




ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. అలాగే యువతకు మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారని, జాబ్ క్యాలెండర్‌ను 'జాబ్ లెస్' క్యాలెండర్‌గా మార్చేశారని దుయ్యబట్టారు. మూసీ సుందరీకరణ పేరుతో లూటీకి ప్రాధాన్యత ఇస్తూ, నోటిఫికేషన్లను గాలికి వదిలేశారని విమర్శించారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు మూలనపడ్డాయని, ఇప్పుడు నైపుణ్య శిక్షణ అంటూ కొత్త పాట పాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి అంటూ ప్రభుత్వం పేర్లు గొప్పగా చెబుతున్నా.. వాస్తవానికి ఆసుపత్రుల్లో మందులు లేక, బడుల్లో వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు గుర్తుచేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయడం, పారిశుధ్యం నిర్వహించడం కనీస బాధ్యత అని, దానిని కూడా ఒక ఈవెంట్‌లా మార్చుకోవడం, గొప్పగా చెప్పుకోవడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. సోలార్ విద్యుత్, పర్యావరణం, డ్రగ్స్ నియంత్రణ వంటి అంశాలన్నీ కేవలం పత్రికల్లో పబ్లిసిటీ కోసమే తప్ప, ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని స్పష్టం చేశారు. పాలనను గాలికి వదిలి పబ్లిసిటీ గారడీలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు గ్రామ గ్రామాన ప్రజలు సిద్ధంగా ఉన్నారని హరీశ్ రావు హెచ్చరించారు.

**కేరళ కోసం టీజీ ఫైసల్**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని సాకులు చెబుతూ, కేరళ ఎన్నికల ప్రచారం కోసం వందల కోట్ల రూపాయిల తెలంగాణ ప్రజాధనాన్ని అడ్వర్టైజ్‌మెంట్ల రూపంలో తగలేస్తున్నారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఖజానా ఒక 'ఏటీఎం'లా మారిందని దుయ్యబట్టారు. మహాలక్ష్మి పథకం కింద రూ. 2,500, తులం బంగారం, స్కూటీల హామీలను విస్మరించి, కేరళ పత్రికల్లో మాత్రం మహిళలను కోటీశ్వరులను చేశామని దొంగ ప్రచారం చేసుకుంటున్నారని హరీశ్ విమర్శించారు. ఏటా 2 లక్షల ఉద్యోగాల హామీ నెరవేర్చకపోగా, నోటిఫికేషన్ల కోసం అడిగే విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయిస్తున్నారని మండిపడ్డారు. ఇక్కడ వృద్ధులకు రూ. 4,000 పెన్షన్ ఇవ్వడానికి చేతులు రాని రేవంత్ రెడ్డికి... కేరళలో ఫుల్ పేజీ యాడ్స్ ఇవ్వడానికి కోట్లు ఎక్కడివని ప్రశ్నించారు. అబద్ధపు ప్రచారాల కోసం ఖర్చు చేసిన ప్రజాధనాన్ని కాంగ్రెస్ పార్టీ తిరిగి ప్రభుత్వానికి చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల రుణమాఫీకి కొర్రీలు పెట్టారని, రైతుబంధు ఆపేశారని, వరికి రూ. 500 బోనస్ ఇవ్వకుండా రైతుల పొట్టగొట్టారని ఆరోపించారు.

## సివిల్స్ విజేతల్లో 20 మంది అభయ హస్తం లబ్ధిదారులు

### సింగరేణి ఉద్యోగి కుమార్తె సృజనకు ఆల్ ఇండియా స్థాయిలో 55 ర్యాంకు

**విజేతలకు అభినందనలు తెలియజేసిన మల్లు భట్టి విక్రమార్క**

హైదరాబాద్, మార్చి 6 (ఈవార్తలు): ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ 2025 తుది ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటడంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.ముఖ్యంగా సివిల్ సర్వీసెస్ లో తెలంగాణ యువత రాణించాలన్న లక్ష్యంతో సింగరేణి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద ఆర్థిక చేయూత అందుకున్న 20 మంది అభ్యర్థులు తుది ఫలితాల్లో విజేతలుగా నిలవడంపై ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ యువత ఆకాంక్షలను సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తుందన్నారు. సింగరేణి ఉద్యోగి జి. రాజేశం కుమార్తె జి. సృజన జాతీయ స్థాయిలో 55వ ర్యాంకు సాధించడంపై సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి హర్షం వ్యక్తం చేశారు. సివిల్స్ విజేతలకు అభినందనలు తెలిపారు. ఈ పథకం కింద ఈ ఏడాది 202 మంది ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణులు అయిన వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు చేతుల మీదుగా లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. వీరిలో 51 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. వారికి మరో లక్ష రూపాయల చొప్పున ఆర్థిక చేయూత అందించగా.. వారిలో ఈ రోజు ప్రకటించిన ఫలితాల్లో 20 మంది విజేతలుగా నిలిచారు. గత ఏడాది ప్రారంభించిన పథకంలో తొలుత 140 మంది ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణత సాధించిన వారికి సాయం అందించగా.. వారిలో 20 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. వారిలో ఏడుగురు విజేతలుగా నిలిచారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద సింగరేణి సంస్థ ఆర్థిక సహాయం పొంది సివిల్ సర్వీసెస్ 2025 తుది ఫలితాల్లో విజేతలుగా ఎంపికైన 20 మందిలో 10 మంది ఓబీసీ అభ్యర్థులు, నలుగురు ఎస్టీ అభ్యర్థులు, ముగ్గురు చొప్పున ఎస్సీ, జనరల్ కేటగిరీ అభ్యర్థులు ఉండటం విశేషం. మొత్తం మీద 16 మంది పురుష అభ్యర్థులు, 4 మంది మహిళా అభ్యర్థులు విజేతలుగా నిలిచారు. అత్యధికంగా రంగారెడ్డి నుండి ఐదుగురు, మేడ్చల్ మల్కాజగిరి మరియు వరంగల్ అర్బన్ నుండి ముగ్గురు చొప్పున ఎంపిక కాగా ములుగు, నల్గొండ, పెద్దపల్లి, సూర్యాపేట, జగిత్యాల, జనగాం, భూపాలపల్లి, మహబూబ్ నగర్, మెదక్ జిల్లాల నుండి ఒక్కొక్కరు ఎంపిక అయ్యారు .

## గణపతి జనంలోకి రావాలి

**నేను కూడా కలిసి పని చేస్తా.. గోనె ప్రకాశ్ రావు పిలుపు**



హైదరాబాద్, మార్చి 6 (ఈవార్తలు): మావోయిస్టు అగ్రనేత గణపతి (ముప్పాళ్ల లక్ష్మణరావు) లొంగిపోతున్నారంటూ వార్తలు వస్తున్నాయి. ఈ పరిణామంపై మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్ రావు స్పందిస్తూ, గణపతి తక్షణమే జనజీవన స్రవంతిలోకి వచ్చి సమాజ సేవ చేయాలని పిలుపునిచ్చారు. తాను కూడా గణపతితో కలిసి పనిచేస్తానని చెప్పారు. 77 ఏళ్ల వయస్సులో ఉన్న గణపతి ప్రస్తుతం తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, ఈ నేపథ్యంలో ఆయన తుపాకీని వదిలి శాంతి మార్గంలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. గణపతి కుమారుడు ముప్పాళ్ల శ్రీనివాస్ (వాసు) పంపిన వాయిస్ మెసేజ్‌ను ఆయన అనుమతి లేకుండా మీడియాకు షేర్ చేసినందుకు గోనె ప్రకాశ్ రావు బహిరంగంగా క్షమాపణలు కోరారు. ఇది కేవలం గణపతి లొంగుబాటుపై ఉన్న ఉత్కంఠ వల్ల జరిగిన పొరపాటుగా ఆయన వివరించారు. మరోవైపు, ఇటీవల లొంగిపోయిన మావోయిస్టు నేత దేవ్‌జీ (తిప్పరి తిరుపతి) రాజకీయాల్లోకి రావాలని ఆశిస్తున్నారని, ఆయన కోరుట్ల నుంచి పోటీ చేసే అవకాశం ఉందని గోనె వెల్లడించడం ఆసక్తికరంగా మారింది. గతంలో సీతక్క వంటి వారు కూడా దళం నుంచి వచ్చి ప్రజా సేవ చేస్తున్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న డెడ్‌లైన్ ప్రకారం మార్చి 31లోపు మావోయిజాన్ని అంతం చేయాలనే లక్ష్యం ఉన్నప్పటికీ... పోలీసులు ఎన్‌కౌంటర్ల కంటే లొంగుబాటులకే ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి వంటి అగ్ర నేతలను సురక్షితంగా సమాజంలోకి తీసుకువచ్చినట్లే, గణపతిని కూడా గౌరవప్రదంగా జనజీవన స్రవంతిలోకి తీసుకురావాలని ఆయన కోరారు.

## వాట్సాప్‌లో సబ్‌స్క్రిప్షన్

### కొత్త ఫీచర్లకు డబ్బులు కట్టాల్సిందే




న్యూఢిల్లీ: మెసేజింగ్ యాప్ వాట్సాప్ త్వరలో సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ తీసుకురానుంది. ఇది ఆప్షనల్ ప్లాన్ మాత్రమే. దీని పేరు 'వాట్సాప్ ప్లస్'. ఇకపై వాట్సాప్‌లో కొన్ని లేటెస్ట్, ఇంట్రస్టింగ్ ఫీచర్స్ వాడాలనుకుంటే మాత్రం ఈ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ తీసుకోవాల్సిందే. అయితే, ఇప్పటివరకు వాట్సాప్‌లో ఉన్న కాల్స్, మెసేజెస్, వీడియో కాలింగ్ వంటి ఫీచర్లను ఉచితంగానే వాడుకోవచ్చు. ప్రస్తుతం 'వాట్సాప్ ప్లస్' ఫీచర్లను మాతృ సంస్థ మెటా అభివృద్ధి చేస్తోంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్ల కోసం ప్రస్తుతం డెవలపింగ్ స్టేజ్‌లోనే ఉంది. ఇక, కొత్తగా రానున్న 'వాట్సాప్ ప్లస్'లో చాలా కస్టమైజ్డ్, ఇంప్రూవ్డ్ ఫీచర్లుంటాయని కంపెనీ వర్గాలు అంటున్నాయి. ఈజీ చాట్ మేనేజ్‌మెంట్, మోర్ ఫ్లెక్సిబిలిటీ, పర్సనలైజేషన్, యాప్ లుక్స్ అండ్ ఫంక్షన్స్‌లో మరింత కొత్తదనం ఉంటుంది. టెక్ నిపుణుల ప్రకారం విజువల్ కస్టమైజేషన్, ఇంటర్‌ఫేస్ కంట్రోల్‌లపై 'వాట్సాప్ ప్లస్' దృష్టి సారించనుంది. యాప్ థీమ్‌ను మార్చుకోవచ్చు. డిఫరెంట్ కలర్స్ యాడ్ చేసుకోవచ్చు. బోలెడన్ని కొత్త ఐకాన్స్ రాబోతున్నాయి. దాదాపు 14 ఐకాన్ స్టైల్స్‌ను డెవలప్ చేస్తోంది సంస్థ. చాట్ పిన్నింగ్ లిమిట్ కూడా పెరగనుంది. ప్రస్తుతం మూడు చాట్స్‌ను మాత్రమే పిన్ చేసుకోవచ్చు. కానీ, సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ తీసుకుంటే 20 చాట్స్ పిన్ చేసుకోవచ్చు. వాట్సాప్ మెసేజెస్, కాల్స్‌కు ప్రత్యేకమైన రింగ్‌టోన్స్ సెట్ చేసుకోవచ్చు. సాధారణంగా ఇతర యాప్స్ నోటిఫికేషన్స్, వాట్సాప్ నోటిఫికేషన్స్‌కు ఒకే తరహా రింగ్ టోన్ ఉంటుంది. కానీ, కొత్త ఫీచర్లతో వాట్సాప్‌నకు, అలాగే వివిధ అకౌంట్లకు డిఫరెంట్ రింగ్‌టోన్ సెట్ చేసుకోవచ్చు. ఇలాంటి పలు కొత్త ఫీచర్లు 'వాట్సాప్ ప్లస్'లో రానున్నాయి. అయినప్పటికీ ప్రస్తుతం ఉన్న మెసేజెస్, వీడియో, వాయిస్ కాల్స్, ఫొటోలు, వీడియోలు పంపడం, సెక్యూరిటీ ఫీచర్లు వంటివి ఉచితంగానే వాడుకోవచ్చు.

## వైరల్ అవ్వాలని రిస్క్ చేయొద్దు

### యువతకు సజ్జనార్ హెచ్చరిక

హైదరాబాద్, మార్చి 6 (ఈవార్తలు): సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవ్వాలని, లైకుల కోసం యువత జీవితాన్ని రిస్క్ చేయవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ హితవు పలికారు. ఒక యువకుడు వేగంగా కదులుతున్న రైలు నుంచి వేలాడుతూ రీల్ చేస్తుండగా స్తంభం ఢీకొట్టి మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేసి, లైఫ్‌ను రిస్క్ చేసేవారిని హెచ్చరించారు. 'సోషల్ మీడియాలో వైరల్ అవ్వాలని తపన పడే వారికి ఇదో హెచ్చరిక. నడుస్తున్న రైలుకు వేలాడుతూ చేసే ఈ స్టంట్లు చూస్తుంటే ప్రాణం మీద తీపి కంటే ఫోన్లో వచ్చే లైకుల మీద ఆశ ఎక్కువైపోయినట్టుంది. ఇలాంటి తెలివితక్కువ పనుల వల్ల ఆ యువకుడికి దక్కింది ఏంటి? కేవలం ఆసుపత్రి బెడ్ లేదా అంతిమయాత్రే కదా. మీ పిచ్చి విన్యాసాలకు ప్రాణం పోయే వరకు ఆగుతారా? ఇంట్లో మీ కోసం ఎదురుచూసే వాళ్ల గురించి కనీసం ఒక్కసారైనా ఆలోచించారా? లైకుల కోసం లైఫ్ రిస్క్ చేసేంత పిచ్చి వద్దు. ప్రాణం పోయాక ఆ రీల్స్ ఎవరూ చూడరు. మీ కుటుంబం మాత్రం జీవితాంతం కన్నీళ్లు పెడుతుంది' అని హితవు పలికారు.

## ఆ గుంతలేంది.. ఆ రోడ్డేంది?

### రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ

అంబర్‌పేట–హైదరాబాద్, మార్చి 6 (ఈవార్తలు): అంబర్‌పేట ఫ్లై ఓవర్ కింద సర్వీస్ రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న అడ్డంకులను తొలగించాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. గత ఏడాది మే నెలలోనే ఈ ఫ్లై ఓవర్‌ను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించినప్పటికీ, కింద సర్వీస్ రోడ్డు పూర్తికాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కిషన్ రెడ్డి తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తయినా, భూసేకరణలో జాప్యం కారణంగా సర్వీస్ రోడ్డు పనులు నిలిచిపోయాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణకు సంబంధించి రూ. 2.54 కోట్ల పరిహారం ప్రభుత్వం చెల్లించినప్పటికీ, కొన్ని శక్తులు అడ్డుతగులుతున్నాయని తెలిపారు. తెలంగాణలో 2014 నుం ఇప్పటి వరకు 2,800 కిలోమీటర్ల జాతీయ రహదారులను నిర్మించామని... అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా చొరవ చూపి, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ అధికారుల ద్వారా ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు.

## శంషాబాద్ నుంచి 12 విమానాలు రద్దు

శంషాబాద్–హైదరాబాద్, మార్చి 6 (ఈవార్తలు): శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లవలసిన 12 విమానాలు రద్దయ్యాయి. ఈ మేరకు ఆర్జీఐఏ అధికారులు వెల్లడించారు. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్–అమెరికా, ఇరాన్ దేశాల మధ్య యుద్ధం నేపథ్యంలో విమానాల రద్దు కొనసాగుతోంది. శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన విమానాలతో పాటు గల్ఫ్ దేశాల నుంచి రావాల్సిన మరో 12 విమానాలు కూడా రద్దయ్యాయి. ఖతార్, యూఏఈ, కువైట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా నుంచి రావాల్సిన విమానాలు రద్దైనట్లు అధికారులు వెల్లడించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా 23 వేలకు పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. దీనితో విమానయాన సంస్థలకు రూ.100 కోట్ల డాలర్లకు పైగా నష్టం వాటిల్లింది. ఇది భారత కరెన్సీలో సుమారు రూ.9,165 కోట్లు. భారత విమానయాన సంస్థలపై కూడా ఈ ప్రభావం అధికంగానే ఉంది.

## వీహెచ్‌కు బుజ్జగింపులు

### వేం నరేందర్ రెడ్డి భేటీ



హైదరాబాద్, మార్చి 6 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైన వేం నరేందర్ రెడ్డి పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ వి. హనుమంతరావును మర్యాదపూర్వకంగా కలిశారు. వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ ఎన్నికల కోసం నామినేషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో పార్టీలోని సీనియర్ నాయకులను కలవాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా వీహెచ్ నివాసానికి చేరుకున్నారు. భవిష్యత్తులో పార్టీ కార్యక్రమాల్లో కలిసి పనిచేసే అంశాలపై వారు చర్చించారని తెలుస్తోంది. రాజ్యసభ టిక్కెట్ ఆశించిన వారిలో వి. హనుమంతరావు కూడా ఉన్నారు. ఆయన కొన్నిరోజుల క్రితం ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ తదితరులను కలిసి టిక్కెట్ కోసం అభ్యర్థించారు. అయితే పార్టీ అధిష్ఠానం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డికి టిక్కెట్ కేటాయించింది. ఈ నేపథ్యంలో టిక్కెట్ ఆశించి భంగపడిన నాయకులు, సీనియర్ నాయకులను కలవాలని వేం నరేందర్ రెడ్డి నిర్ణయించుకున్నారు.

# పిన్నింటి సాయికి కీలక పదవి



శ్రీకాకుళం, మార్చి 6 (ఈవార్తలు): ఎచ్చెర్ల నియోజకవర్గం వైసీపీ నాయకులు పిన్నింటి సాయికుమార్ ను శ్రీకాకుళం నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఉత్తర్వులను విడుదల చేసింది. ఎ చర్ల నియోజకవర్గంలో సీనియర్ నాయకులుగా ఉన్న తినండి సాయికుమార్ నియామకం పట్ల ఆ పార్టీ శ్రేణులు హర్షణ వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పెనం సాయికుమార్ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా పలువురు నాయకులు కోరారు. ఈ సందర్భంగా పిన్నింటి సాయికుమార్ మాట్లాడుతూ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. శ్రీకాకుళంలో మళ్లీ పార్టీ జెండా ఎగురువేసేలా వ్యవహారాధన చేసేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, భవిష్యత్తులో పార్టీ ఇటువంటి బాధ్యతను అప్పగించిన నిర్వర్తించడానికి సిద్ధంగా ఉంటారని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# నూతన ఆవిష్కరణలు చేయాలి

**ఓయూ ఫిజిక్స్ విభాగం హెచ్ ఓడి డాక్టర్ ఎం.ప్రసాద్**



హైదరాబాద్, మార్చి 6 (ఈవార్తలు): వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను పెంచుతాయని ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం హెచ్ ఓడీ డాక్టర్ ఎం.ప్రసాద్ అన్నారు. జాగృతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డి. జోసఫిన్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నారాయణగూడ లోని పద్మశాలి భవన్ లో 'న్యూరోనోవా సైన్స్ ఫెస్ట్' ను నిర్వహించారు. విద్యార్థులు రూపొందించి ప్రదర్శించిన ప్రాజెక్టులను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిశోధనలపైనే దేశాభివృద్ధి ఆధారపడి ఉందన్నారు. డిగ్రీ చదివే విద్యార్థులు పరిశోధనా రంగంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. యువత తమ బాధ్యతలను గుర్తించి సరైన మార్గంలో పయనించాలని కోరారు. కొత్త పరిశోధనలు చేస్తూ విద్యార్థులు శాస్త్రవేత్తల స్థాయికి ఎదగాలని అన్నారు. మానవ వికాసానికి కొత్తక్రొకొ ఆవిష్కరణలు జరపవలసి ఉంటుందని అన్నారు. విద్యార్థి దశలో పరిశోధన తత్వాన్ని విజ్ఞాన ప్రదర్శనల ద్వారా చేకూరుతుందని అతను చెప్పారు. ప్రతి విద్యార్థి విజ్ఞాన ప్రదర్శన పోటీలో పాల్గొని తన విజ్ఞతను ప్రదర్శించాలని అన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ర్యాంప్ వాక్ ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో జాగృతి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఓ.శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ డి. జోసఫిన్ రెడ్డి, కార్యదర్శి ఎ. శశికిరణ్ రెడ్డి, ఎన్. నీతారెడ్డి, సంతోష్ రెడ్డి, మధుసూధన్, ఓఏ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# ముత్యంపేట నేతాజీ యూత్ క్లబ్ అధ్యక్షుడిగా శ్రీకాంత్ రెడ్డి

మల్యాల, మార్చి 6 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట నేతాజీ యూత్ క్లబ్ అధ్యక్షుడిగా సంత శ్రీకాంత్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు యూత్ సభ్యులు సన్మానం చేశారు. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్న యూత్ సభ్యులం అందరం కలిసి సమస్యలు తీర్చేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.



# సూర్య ధన్వంతరి ఆలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాల టౌన్, మార్చి 6 (ఈవార్తలు): జగిత్యాల పట్టణం చింతకుంటలోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, లలితా సహస్ర నామాల స్తోత్ర పారాయణం చేశారు. పారాయణం అనంతరం మాతలు అమ్మ వారికి ఒడి బియ్యం సమర్పించారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, మహిళా సమితి సభ్యులు వొడ్నాల లత, గీత, అన్నపూర్ణ, సంధ్య, వనిత, మాధురి, హర్షిణి, అన్నపూర్ణ, రాణి, భాగ్య లక్ష్మి, పుష్పలత, గంగవ్వ, అర్చకుడు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.




# మల్యాలలో 'ప్రగతి ప్రణాళిక' షురూ

మల్యాల, మార్చి 6 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి అభివృద్ధిపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ నుంచి మార్కండేయ గుడి వరకు భారీ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఆర్, ఈవో, సర్పంచ్, వార్డు సభ్యులు, ఆశావర్కర్లు, జీపీ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దేవుడితో రాజకీయమా?

**పుణ్యక్షేత్రాల ప్రతిష్టను దిగజార్చేలా కూటమి పాలన**

**మాజీమంత్రి రోజా తీవ్ర విమర్శలు**



నగరి, మార్చి 6 (ఈవార్తలు): ఏపీలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేత, మాజీ మంత్రి ఆర్కే రోజా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ... రాజకీయ లబ్ధి కోసం దేవుడిని, ఆలయాల ప్రతిష్ఠను వాడుకోవడం తగదని హితవు పలికారు. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో వస్తున్న ఆరోపణలు అసత్యమని, భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాజకీయం చేయడానికి వేరే అంశాలు లేకనే దేవుడిని, ఆలయాలను వివాదాల్లోకి లాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల, శ్రీశైలం, అన్నవరం వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల ప్రతిష్ఠను కూటమి నేతలు దిగజార్చుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, హోం మంత్రి వంటి ఉన్నత స్థానాల్లో ఉన్న వారు బాధ్యతాయుతంగా మాట్లాడాలని హితవు పలికారు. శాసనమండలి చైర్మన్ స్థానంలో ఉన్న వ్యక్తి కులం, మతం గురించి మాట్లాడటం అత్యంత విచారకరమని వ్యాఖ్యానించారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో తమ వైపు తప్పు లేదని ప్రభుత్వం భావిస్తే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతే రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలని ఎద్దేవా చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు అసత్య ప్రచారాలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

# 441.63 కోట్ల విలువైన ఆస్తులు అటాచ్

**ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఈడీ దూకుడు**



విజయవాడ, మార్చి 6 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసు దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితులుగా ఉన్న కెసిరెడ్డి రాజశేఖర రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, ఇతర నిందితులకు చెందిన రూ.441.63 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేస్తున్నట్లు శుక్రవారం ఈడీ అధికారికంగా ప్రకటించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈ ఆస్తులను జప్తు చేశారు. ఈడీ తెలిపిన వివరాల ప్రకారం.. జప్తు చేసిన ఆస్తుల్లో కెసిరెడ్డి రాజశేఖర రెడ్డి, బూనేటి చాణక్య, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి తదితరులకు చెందిన బ్యాంక్ బ్యాలెన్సులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, భూములు, ఇతర స్థిరాస్తులు ఉన్నాయి. ఏపీలో 2019కి ముందు మద్యం వ్యాపారం పారదర్శకంగా, డిజిటల్ ట్రాకింగ్‌తో జరిగేదని, అయితే ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం కావాలనే ఆటోమేటెడ్ విధానాన్ని రద్దు చేసి మాన్యువల్ విధానాన్ని తీసుకొచ్చిందని ఈడీ పేర్కొంది. ఈ కొత్త విధానం ద్వారా అధికారులకు విచక్షణాధికారాలు కట్టబెట్టి, తమకు నచ్చిన బ్రాండ్లకు అనుకూలంగా వ్యవహరించారని దర్యాప్తులో తేలింది. ఆర్డర్లు ఇవ్వాలంటే 15 నుంచి 20 శాతం ముడుపులు ఇవ్వాలని డిస్టిలరీలను సిండికేట్ సభ్యులు డిమాండ్ చేశారని, నిరాకరించిన వారి చెల్లింపులు నిలిపివేశారని ఈడీ ఆరోపించింది. ఈ అక్రమాల వల్ల ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.3,500 నుంచి రూ.4,000 కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేసింది. వసూలు చేసిన ముడుపులను హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో దాచిపెట్టి, అక్కడి నుంచి తరలించినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో కీలక నిందితులు 'సిగ్నల్ వంటి ఎన్‌క్రిప్టెడ్ యాప్స్ ద్వారా సంభాషణలు జరిపారని, దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని ఈడీ స్పష్టం చేసింది.

# రూ.26.86 కోట్ల ఆస్తులు అటాచ్

**ఆంధ్రా బ్యాంకును మోసగించిన కేసులో ఈడీ చర్యలు**

హైదరాబాద్, మార్చి 6 (ఈవార్తలు): బ్యాంకు రుణాల మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్ జోనల్ అధికారులు కీలక చర్యలు చేపట్టారు. సౌభాగ్య ఇస్పాత్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్ఐఐపీఎల్) కంపెనీకి చెందిన రూ.26.86 కోట్ల విలువైన స్థిరాస్తులను తాత్కాలికంగా అటాచ్ చేస్తున్నట్లు ప్రకటించారు. జప్తు చేసిన ఆస్తుల్లో ప్లాట్లు, ఇళ్లు, ఇతర స్థలాలు ఉన్నట్లు ఈడీ తెలిపింది. ఆంధ్రా బ్యాంకు (ప్రస్తుతం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)ను మోసగించి, బ్యాంకుకు నష్టం కలిగించారన్న అభియోగంపై సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ దర్యాప్తు చేపట్టింది. స్టీల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు, విస్తరణ పేరుతో కంపెనీ డైరెక్టర్లు, ఇతర నిందితులు బ్యాంకు నుంచి టర్మ్ లోన్లు, వర్కింగ్ క్యాపిటల్ తీసుకున్నారు. అయితే, అర్హత కంటే ఎక్కువ రుణాలు పొందేందుకు నకిలీ స్టాక్ స్టేట్‌మెంట్లు, తప్పుడు ఆర్థిక నివేదికలు, ఫోర్జరీ పత్రాలను బ్యాంకుకు సమర్పించినట్లు విచారణలో తేలింది. తీసుకున్న రుణాలను వ్యాపార అవసరాలకు వాడకుండా.. ఇతర మార్గాల్లో దారి మళ్లించినట్లు ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. సంబంధిత సంస్థల ద్వారా లావాదేవీలు జరిపినట్లు రికార్డులు సృష్టించి, కంపెనీ టర్నోవర్‌ను కృత్రిమంగా పెంచి చూపించారు. ఇలా మోసపూరిత మార్గాల ద్వారా సుమారు రూ.46.52 కోట్ల మేర నేరపూరిత ఆదాయాన్ని ఆర్జించినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో బ్యాంకు ఇప్పటికే రూ.15.52 కోట్లను రికవరీ చేసింది. మిగిలిన మొత్తానికి సంబంధించి.. ప్రస్తుతం మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద రూ.26.86 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు ఈడీ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది.



# బొత్సకు మళ్లీ అస్వస్థత

అమరావతి, మార్చి 6 (ఈవార్తలు): వైసీపీ సీనియర్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. శాసనమండలిలో జరుగుతున్న చర్చలో భాగంగా ఆయన మాట్లాడుతుండగా అస్వస్థతకు లోనయ్యారు. సభలో ప్రసంగిస్తున్న సమయంలో బొత్స తీవ్రంగా ఇబ్బంది పడటాన్ని గమనించిన మంత్రి పయ్యావుల కేశవ్ వెంటనే స్పందించారు. బొత్స ఇబ్బందిని గుర్తించిన మంత్రి పయ్యావుల.. ప్రసంగాన్ని కాసేపు నిలిపివేసి, కూర్చుని విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ క్రమంలోనే అసెంబ్లీ అధికారులు వెంటనే వైద్యులను మండలికి పిలిపించారు. అక్కడికి చేరుకున్న వైద్య బృందం అసెంబ్లీ ఆవరణలోని డిస్పెన్సరీలో బొత్సకు పలు రకాల పరీక్షలు నిర్వహించింది. రక్తపోటు (బీపీ)లో హెచ్చుతగ్గుల కారణంగానే బొత్స అస్వస్థతకు గురయ్యారని డాక్టర్లు తెలిపారు. ప్రస్తుతం ఆయనకు విశ్రాంతి చాలా అవసరమని వైద్యులు స్పష్టం చేశారు. అస్వస్థత నేపథ్యంలో అసెంబ్లీ వైద్యులు.. బొత్సకు రెగ్యులర్ గా చికిత్స అందించే స్పెషలిస్ట్ డాక్టర్లతోనూ మాట్లాడారు. ప్రస్తుతం బొత్స ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. అయితే ముందస్తు జాగ్రత్తగా, మెరుగైన వైద్య చికిత్స కోసం బొత్సను హైదరాబాద్ కు తరలించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఇటీవలే బొత్స అనారోగ్య సమస్యలతో హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే.





# పౌరాణిక పాత్రల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**విజయవాడలో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమం**

**భీముడి పాత్రలో మెప్పించిన డిప్యూటీ స్పీకర్ రఘురామ**

**కట్టబొమ్మనగా డైలాగులు చెప్పిన మంత్రి కందుల దుర్గేష్**

విజయవాడ, మార్చి 6 (ఈవార్తలు): నిత్యం ప్రజా సమస్యలు, అసెంబ్లీ సమావేశాలు, రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలతో బిజీగా గడిపే రాష్ట్ర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శుక్రవారం మంచి 'ఆటవిడుపు' దొరికింది. ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ ఆధ్వర్యంలో విజయవాడలోని ఆంత్రాలూక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన 'ఎమ్మెల్యే-ఎమ్మెల్సీ క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు-2026' వేడుకగా సాగాయి. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొని, తమలోని కళాకారులను బయటకు తీశారు. ముఖ్యంగా పౌరాణిక, చారిత్రక నాటక ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు భీముడి పాత్రలో కనిపించి తనదైన హావభావాలతో మెప్పించారు. నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు శ్రీకృష్ణదేవరాయల వేషధారణలో ఠీవిగా కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఇక బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ నిరంకుశత్వాన్ని ఎదిరించిన స్వాతంత్ర్య సమరయోధుడు 'వీరపాండ్య కట్టబొమ్మన' పాత్రలో మంత్రి కందుల దుర్గేశ్ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ 'రుద్రవీణ' చిత్రంలోని 'లలిత ప్రియ కమలం' పాట పాడి సభికులను అలరించారు. వీరితో పాటు జీవీ ఆంజనేయులు, కామినేని శ్రీనివాస్, జయమంగళ వెంకటరమణ, సునీల్ తదితరులు వివిధ పాత్రల్లో సందడి చేశారు. రాజకీయాలకు కాసేపు విరామమిచ్చి, నాయకులంతా ఇలా ఒకే వేదికపై సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం అక్కడి వారికి ఆనందాన్ని పంచింది.





# టీటీడీ ఈవోగా ముద్దాడ బాధ్యతలు

తిరుమల, మార్చి 6 (ఈవార్తలు): సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నూతన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత భూవరాహ స్వామిని దర్శించుకున్న ఆయన, అనంతరం శ్రీవారి సన్నిధిలో బంగారు వాకిలి వద్ద టీటీడీ బోర్డు ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆయనతో ప్రమాణం చేయించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం రవిచంద్ర మాట్లాడుతూ... శ్రీవారికి సేవ చేసే అవకాశం రావడం తన పూర్వజన్మ సుకృతమని ఆనందం వ్యక్తం చేశారు.

# ఇరాన్ అధినేతను నేనే నిర్ణయిస్తా: ట్రంప్

వాషింగ్టన్: ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్‌ను తానే స్వయంగా ఆమోదించాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త క్షిపణి దాడుల్లో ఇరాన్ అగ్రనేత అయాతుల్లా అలీ ఖమేనీ మరణించిన నేపథ్యంలో, ఆయన వారసుడి ఎంపికపై ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. యాక్సియోస్‌కు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ... ఖమేనీ కుమారుడు మొజ్తబా ఖమేనీని కొత్త అధినేతగా నియమించడాన్ని తాను అంగీకరించనని స్పష్టం చేశారు. "ఇరాన్‌కు శాంతి, సామరస్యాన్ని తీసుకొచ్చే వ్యక్తి కావాలి. ఖమేనీ విధానాలనే కొనసాగించే వ్యక్తి వస్తే, మరో ఐదేళ్లలో మళ్లీ యుద్ధం చేయాల్సి వస్తుంది. ఖమేనీ కుమారుడు ఒక పనికిరాని వ్యక్తి. వెనెజువెలాలో డెల్సీ రోడ్రిగ్జ్‌ను మధ్యంతర అధ్యక్షురాలిగా నియమించిన తరహాలోనే, ఇక్కడ కూడా నేను కచ్చితంగా జోక్యం చేసుకుంటాను" అని ట్రంప్ అన్నారు. మొజ్తబా ఖమేనీ, తన తండ్రి తర్వాత సుప్రీం లీడర్ పదవికి ప్రధాన అభ్యర్థిగా ప్రచారంలో ఉన్నారు. అయితే, వారసత్వంగా ఈ పదవిని చేపట్టడాన్ని 2024లోనే అలీ ఖమేనీ వ్యతిరేకించారు. బ్లూమ్‌బెర్గ్ వార్తా సంస్థ కథనం ప్రకారం, మొజ్తబా ఖొమైనీకి 100 మిలియన్ డాలర్లకు పైగా సంపద ఉన్నట్లు అంచనా. కాగా, ప్రభుత్వంలో ఎలాంటి పదవిలో లేకపోయినా తన తండ్రి కార్యాలయంలో పనిచేస్తూ ఆయనకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ 2019లోనే ట్రంప్ ప్రభుత్వం మొజ్తబాపై ఆంక్షలు విధించింది. మరోవైపు ఇరాన్‌లో అధికార మార్పు తమ లక్ష్యం కాదని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పష్టం చేశారు. ఇరాన్ క్షిపణి వ్యవస్థ, నౌకాదళాన్ని ధ్వంసం చేయడం, అణ్వాయుధాలు లేకుండా చూడటమే తమ ఆపరేషన్ లక్ష్యమని ఆయన తెలిపారు. మరోపక్క, ఇదే సమయంలో ఇరాన్ చివరి చక్రవర్తి కుమారుడైన రెజా పహ్లవి తాను తాత్కాలిక నేతగా తిరిగి వస్తానని, ఆ తర్వాత ఇరాన్‌ను లౌకిక ప్రజాస్వామ్య దేశంగా తీర్చిదిద్దేందుకు కొత్త రాజ్యాంగం రూపొందించాలని ప్రతిపాదించారు.



ఇస్లామిక్ రిపబ్లిక్ కింద ఏ కొత్త నాయకుడు వచ్చినా చట్టబద్ధత ఉండదని ఆయన పేర్కొన్నారు. ఖమేనీ మరణంతో ఇరాన్ నాయకత్వంపై నెలకొన్న అనిశ్చితి, ట్రంప్ వ్యాఖ్యలతో మరింత తీవ్రరూపం దాల్చింది.

## రోజుకు 8000 కోట్లు ఖర్చు

### ఇరాన్‌తో యుద్ధం కోసం అమెరికా వ్యయం

వాషింగ్టన్: ఇరాన్ యుద్ధం కోసం అమెరికా భారీగా ఖర్చు పెడుతున్నట్లు పలు నివేదికలు చెబుతున్నాయి. అమెరికాలోని వాషింగ్టన్‌కు చెందిన సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ (సీఎస్ఐఎస్) అనే సంస్థ నివేదిక ప్రకారం అమెరికరా ఈ యుద్ధం కోసం భారీగా ఖర్చు చేస్తోంది. శుక్రవారం నాటికి ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమై వారం రోజులు అవుతోంది. ఇన్ని రోజులు యుద్ధంపై చేసిన ఖర్చుపై అంచనాల్ని ఈ నివేదిక వెల్లడించింది. యుద్ధం మొదలైన మొదటి 100 గంటల్లోనే అమెరికా 3.7 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. అలాగే ఈ వారం రోజులపాటు సగటున రోజుకు 900 మిలియన్ డాలర్లు ఖర్చైంది. అంటే మన కరెన్సీలో రోజుకు రూ.8,300 కోట్ల వరకు ఖర్చవుతోంది. ఇప్పటికే వాడిన ఆయుధాల స్థానంలో కొత్తవి రూపొందించేందుకు భారీగా ఖర్చవుతుంది. అదనంగా 3.1 బిలియన్ డాలర్లు అవసరం. రోజుకు 758 మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాల్ని యుద్ధంలో వినియోగిస్తున్నారు. ఫైటర్ విమానాల కోసం కూడా భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ ఖర్చు రక్షణ శాఖకు కేటాయించిన బడ్జెట్‌కు అదనం. అంటే ఈ నిధుల కోసం అమెరికా రక్షణ శాఖ మళ్లీ నిధుల్ని అడగాల్సి ఉంటుంది. దీనికి అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం తెలపాలి. అయితే, ఇది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిపెట్టొచ్చు. అదనంగా నిధులు కోరితే ప్రతిపక్షం వ్యతిరేకించవచ్చు. కానీ, నిధులు లేకపోతే యుద్ధాన్ని కొనసాగించడం కూడా కష్టమవుతుంది. ఇప్పటికే అమెరికా ప్రజల్లో ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, చమురు ధరల పెరుగుదల, జీవన వ్యయం పెరగడం వంటి వాటిపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ పరిణామాలు ట్రంప్‌కు ఇబ్బందిగా మారొచ్చనేది విశ్లేషకుల అంచనా.



## కిటికీలకు దూరంగా ఉండండి

### పౌరులకు దుబాయ్ హెచ్చరికలు

దుబాయ్: అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో దుబాయ్ అధికారులు ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా తనపై దాడి చేస్తుండటంతో గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ ప్రతీకార దాడులు చేస్తోంది. ఇరాన్ నుంచి వచ్చే క్షిపణులు, డ్రోన్లను ఎప్పటికప్పుడు అడ్డుకుంటున్నామని యూఏఈ రక్షణ శాఖ తెలిపింది. ఈ క్రమంలో భారీ శబ్దాలు వినిపిస్తున్నట్లు వెల్లడించింది. దుబాయ్‌లో కూడా స్థానిక పౌరులకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. శుక్రవారం నాడు క్షిపణి దాడులు జరిగే అవకాశం ఉందని కొంతమందికి మొబైల్ అలర్ట్ లు వస్తున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని, ముందుజాగ్రత్త చర్యగా కిటికీలకు దూరంగా ఉండాలని సూచించింది. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలనే దానిపై ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా, మొబైల్ ఫోన్ల ద్వారా పౌరులకు జాగ్రత్తలు చెబుతోంది.

## కలరి విన్యాసం చేసిన రాహుల్

ఇదుక్కి: లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేరళ పర్యటనలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ఇదుక్కి జిల్లాలోని మరియన్ కాలేజీ (కుట్టిక్కనం క్యాంపస్) విద్యార్థులతో ఆయన ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా కేరళ అత్యంత ప్రాచీన యుద్ధ విద్య అయిన 'కలరిపయట్టు' (కలరి) విన్యాసాలను విద్యార్థులతో కలిసి ప్రయత్నించి అందరినీ ఆకట్టుకున్నారు. కాలేజీ విద్యార్థులతో రాహుల్ ముచ్చటిస్తుండగా, కలరి విద్యను ప్రయత్నించమని ఒక విద్యార్థి కోరారు. దీనికి రాహుల్ వెంటనే అంగీకరించి, విద్యార్థులతో కలిసి కొన్ని ప్రాథమిక కలరి కదలికలు చేశారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. కలరిపయట్టు ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన మార్షల్ ఆర్ట్ అని, ఇది అన్ని యుద్ధ విద్యలకు 'తల్లి' వంటిదని అభివర్ణించారు. కేరళ సంప్రదాయాల్లో అపారమైన బలం, క్రమశిక్షణ, గ్రేస్ ఉన్నాయని ఆయన కొనియాడారు. కలరి అనేది శారీరక దృఢత్వం, ఫ్లెక్సిబిలిటీ, ఆత్మరక్షణల సమాహారమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు, మహాత్మా గాంధీ, శ్రీనారాయణ గురు సమావేశమై వందేళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన శతాబ్ది ఉత్సవాల్లో రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాలు, అంతర్జాతీయ సంబంధాలు ఆందోళనకర దిశలో సాగుతున్నాయని విమర్శించారు.

## భారత నౌకలకు ఇబ్బందేం లేదు: ఇరాన్

టెహ్రాన్: హోర్ముజ్ జలసంధిలో భారతీయ చమురు నౌకల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలిగించడం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి సయీద్ ఖతిబ్‌జాదే ఒక అంతర్జాతీయ మీడియా సంస్థతో మాట్లాడుతూ, భారత నౌకలను తాము అడ్డుకుంటున్నట్లు వస్తున్న వార్తలను తోసిపుచ్చారు. అదే సమయంలో హిందూ మహాసముద్రంలో ఇరాన్ నౌకలపై జరుగుతున్న దాడుల విషయంలో భారత్ చొరవ తీసుకోవాలని, ఈ దాడులకు కారణమైన అమెరికాను ప్రశ్నించాలని ఆయన సూచించారు. హోర్ముజ్ జలసంధిలో స్థిరత్వం కోసం ఇరాన్ నిరంతరం ప్రయత్నిస్తుందని, ఒకవేళ ఆ జలసంధిని మూసివేయాల్సి వస్తే తామే అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. ప్రస్తుతానికి అలాంటి ఉద్దేశం లేదని, తమది బాధ్యతాయుతమైన దేశమని స్పష్టం చేశారు. అంతర్జాతీయ జలాల్లో అమెరికా తీరు ప్రమాదకరంగా ఉందని, ఆ దేశపు "ఫుట్‌బాల్ మెంటాలిటీ" (దూకుడు స్వభావం) వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు. భారత్, ఇరాన్ దేశాలు "చదరంగం" ఆడే మనస్తత్వం కలవని, అంటే దౌత్యపరమైన ఆలోచనలతో, వ్యూహాత్మకంగా సమస్యలను పరిష్కరించుకుంటాయని ఆయన అభివర్ణించారు. ఉద్రిక్తతలను తగ్గించుకోవడానికి దౌత్యమే సరైన మార్గమని, వివాదాలను చర్చల ద్వారానే పరిష్కరించుకోగలమని ఆయన అభిప్రాయపడ్డారు.

## యుద్ధంలో వందలాది చిన్నారులు బలి

### ఇప్పటిదాకా 181 మంది బాలల మృతి

### ఐక్యరాజ్య సమితి ఏజెన్సీ యూనిసెఫ్ వెల్లడి

జెనీవా: అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ దాడుల కారణంగా పశ్చిమాసియాలో వందల సంఖ్యలో చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని యూనిసెఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. గత నెల 28న ప్రారంభమైన యుద్ధం నేటితో ఏడవ రోజుకు చేరుకున్నది. ఈ యుద్ధంలో అత్యధికంగా ఇరాన్‌లో చిన్నారులు చనిపోయినట్లు తెలిపింది. ఇరాన్‌లో 181 మంది, లెబనాన్‌లో 7గురు, ఇజ్రాయెల్‌లో ముగ్గురు, కువైట్‌లో ఒకరు మృతి చెందినట్లు వెల్లడించింది. యుద్ధాలను పిల్లలు ప్రారంభించరని కానీ వారు కూడా మూల్యం చెల్లించుకుంటున్నారని పిల్లల హక్కులు, ఆరోగ్యం, విద్య, సంక్షేమం కోసం పనిచేసే ఈ ఐక్యరాజ్య సమితి ఏజెన్సీ ఆవేదన వ్యక్తం చేసింది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు ఇప్పటికే చిన్నారులపై ఆందోళనకర ప్రభావాన్ని చూపిందని పేర్కొంది. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త ఆపరేషన్‌లో మొదటి రోజు ఇరాన్‌లోని మినాబ్‌లో ఒక బాలికల పాఠశాలపై దాడి జరగగా, 160 మంది చిన్నారులు మృతి చెందినట్లు ఇస్లామిక్ రెవెల్యూషనరీ గార్డ్ కోర్ తెలిపింది.



## ఇక క్యూబా సంగతి చూస్తాం: ట్రంప్

వాషింగ్టన్: ఇరాన్ విషయం తేల్చిన తర్వాత క్యూబాపై దృష్టి సారిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. 2025 మేజర్ లీగ్ సాకర్ ఛాంపియన్స్‌గా నిలిచిన ఇంటర్ మయామి జట్టుకు శ్వేతసౌధంలో ట్రంప్ ఘనంగా ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ఇరాన్ పని ముగించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇజ్రాయెల్‌తో కలిసి అనుకున్న దానికంటే వేగంగానే తమ దళాలు ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తున్నాయని అన్నారు. వరుస దాడుల వల్ల ఇరాన్ సైనిక సామర్థ్యాలు కూడా భారీగా క్షీణించాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇజ్రాయెల్, అమెరికాకు ఉన్నట్లు ఇరాన్‌కు సమర్థవంత వైమానిక దళం లేదని అన్నారు. ఇప్పటికే ఇరాన్ నావికా దళాన్ని నాశనం చేశామని అన్నారు. మూడు రోజుల్లో 24 ఇరాన్ నౌకలను తుడిచి పెట్టడంతో ఇరాన్ అధికారులు కాళ్ల బేరానికి వచ్చారని అన్నారు. అణు ఒప్పందంపై చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నట్లు వారు తమతో చెప్పారని వెల్లడించారు. వారి విజ్ఞప్తిని తోసిపుచ్చామని, ఇప్పటికే ఆలస్యమైందని వారికి స్పష్టం చేసినట్లు ట్రంప్ తెలిపారు. టెహ్రాన్ రాజకీయ భవిష్యత్తును పునర్నిర్మించడానికి ఇరాన్ దౌత్యవేత్తలు తమకు సహకరించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తమతో ఒప్పందం కోసం క్యూబా కూడా వేచిచూస్తోందని ట్రంప్ తెలిపారు. కానీ ఆ దేశ ప్రభుత్వం అమెరికా జాతీయ భద్రతకు, విదేశాంగ విధానానికి తీవ్రమైన ముప్పుగా మారిందని పేర్కొన్నారు. ఇరాన్ పని ముగిసిన తర్వాత క్యూబా సంగతి చూస్తామని అన్నారు. అయితే అది ఎప్పుడనేది ఇప్పుడే చెప్పలేమని వ్యాఖ్యానించారు. పశ్చిమాసియాలో తమ ఆపరేషన్ ముగిసిన తర్వాత అమెరికా విదేశాంగ విధాన ప్రాధాన్యతలలో పలు మార్పులు చోటు చేసుకుంటాయని అన్నారు.

## న్యూయార్క్ మేయర్‌నే నియమించలేడు

### ట్రంప్‌కు ఇరాన్ మంత్రి చురకలు

టెహ్రాన్: ఇరాన్‌లో పాలన మార్పుకు అమెరికా, ఇజ్రాయెల్ ప్రయత్నిస్తున్నాయని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్‌ను ఎన్నుకోవడంలో తన పాత్ర ఉండాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ అంశంపై ఇరాన్ విదేశాంగ సహాయమంత్రి సయ్యద్ ఖతిబ్జాదే తీవ్రంగా స్పందించారు. ట్రంప్ తన దేశంలోని న్యూయార్క్ మేయర్‌ను కూడా నియమించలేడని, అలాంటిది ఇరాన్ సుప్రీం లీడర్‌ను ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో ఇటీవల మమ్దానీ ఎన్నికైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మమ్దానీ అగ్రరాజ్యం అధ్యక్షుడు ట్రంప్‌ను తీవ్రంగా విమర్శించే వ్యక్తి అని పేర్కొన్నారు. "న్యూయార్క్ మేయర్‌ను నియమించలేని ట్రంప్ ఇరాన్ లీడర్‌ను నియమిస్తారా" అని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఇజ్రాయెల్, అమెరికాలపై తన దేశం చేపడుతున్న చర్యలను ఆయన సమర్థించారు. అమెరికా ఆస్తులే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. పశ్చిమాసియాలోని అమెరికా ఆస్తులపై తాము దాడులు చేస్తున్నామని, ఈ దాడుల వల్ల ఆ దేశాల్లోని ప్రజలకు ఎలాంటి నష్టం చేయడం లేదని తెలిపారు. అగ్రరాజ్యం ఆస్తులను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటున్నట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌక ఐరిస్ దేనాను అమెరికా ముంచివేసిన ఘటనపై కూడా ఆయన స్పందించారు. భారత స్నేహితుల ఆహ్వానం మేరకు ఆ నౌక ఇక్కడకు వచ్చిందని, దానిపై అమెరికా దాడి చేయడం దురదృష్టకరమని అన్నారు.

# సుఖోయ్ ప్రమాదంలో పైలట్లు మృతి



గౌహతి: సుఖోయ్ యుద్ధ విమానం ప్రమాదంలో ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న పైలట్ కూడా మృతి చెందారు. ఈ విమాన ప్రమాదంలో ఇద్దరు పైలట్లు మృతి చెందగా, వారిలో ఒకరు ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేశ్ దురాగ్‌కర్ ఉన్నారు. ఆయన ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నారు. పూర్వేశ్ మృతి చెందడంతో నాగపూర్‌లోని వారి కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. ఆయన వయస్సు 28. ఈ మృతి వారి కుటుంబాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. పూర్వేశ్ తండ్రి రవీంద్ర దురాగ్‌కర్ రిటైర్డ్ రైల్వే ఉద్యోగి. బుధవారం రోజే కుమారుడితో మాట్లాడామని, కానీ ఇంతలోనే ఈరోజు గ్రూప్ కెప్టెన్ ఫోన్ చేసి ఈ ప్రమాదం గురించి తెలియజేశాడని రవీంద్ర కంటతడిపెట్టారు. దేశానికి సేవ చేయాలనే మక్కువతో తన కుమారుడు యుద్ధ విమానం పైలట్‌గా మారాడాని అన్నారు. దేశం కోసం యుద్ధ విమానాలను నడిపిన తన కుమారుడిని చూసి గర్విస్తున్నానని పేర్కొన్నారు. గత సంవత్సరం పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్ సిందూర్‌లో పూర్వేశ్ పాల్గొన్నారు. తన కుమారుడు మొదట అసోంలోని తేజ్‌పూర్‌లో విధుల్లో చేరారని, అక్కడ రన్‌వే పనులు కొనసాగుతున్నందున తాత్కాలికంగా సుఖోయ్ ప్రమాదం జరిగిన జోర్హాట్ వైమానిక స్థావరం వద్ద విధులు నిర్వహిస్తున్నట్లు తండ్రి వెల్లడించారు. యుద్ధ విమాన పైలట్‌గా తన అనుభవాలను తన కుమారుడు తనతో పంచుకునేవాడని వెల్లడించారు. "నా కుమారుడు భారత వైమానిక దళంలో భాగమైనందుకు గర్విస్తున్నాను" అని ఆ తండ్రి పేర్కొన్నారు. పది రోజుల క్రితమే ఆ కుటుంబమంతా కలిసిందని, పూర్వేశ్ కూడా వచ్చారని స్థానికులు గుర్తు చేసుకున్నారు. వీరి కుటుంబమంతా కలిసినప్పుడు పూర్వేశ్‌తో పాటు అమెరికాలో నివసిస్తున్న సోదరి కూడా నాగపూర్ వచ్చినట్లు తెలిపారు. పూర్వేశ్ నాగపూర్‌లోనే చదువుకున్నారు. అతనికి ఇంకా వివాహం కాలేదు.

# మైనర్‌పై ట్రంప్ అత్యాచారం

### ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రకంపనలు



న్యూయార్క్: జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం, దశాబ్దాలుగా అమెరికా రాజకీయ, సామాజిక వర్గాలను ఉక్కిరిబిక్కిరి చేస్తూనే ఉంది. తాజాగా అమెరికా న్యాయశాఖ (డీఓజే) సుమారు 47 వేల పత్రాలను బహిరంగపరచడం.. అందులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై వచ్చిన తీవ్రమైన ఆరోపణలు ప్రస్తావనకు రావడం.. మరోసారి ఈ కేసును కేంద్ర బిందువుగా మార్చింది. ఈ పరిణామాలు కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన ఆరోపణలు మాత్రమే ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో తాజాగా వెలుగులోకి వచ్చిన అంశాలు 1980ల నాటి ఘటనలను గుర్తు చేస్తున్నాయి. ఒక మహిళ ఎఫ్‌బీఐకి ఇచ్చిన వాంగ్మూలం ఇప్పుడు సంచలనంగా మారింది. ఆ మహిళ తాను మైనర్‌గా ఉన్నప్పుడే జెఫ్రీ ఎప్‌స్టీన్ ద్వారా ట్రంప్‌కు పరిచయం చేయబడ్డానని.. ఆ తర్వాత ఇద్దరూ తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఆరోపించడం తీవ్ర కలకలం రేపుతోంది. అంతేకాకుండా ఆ సమయంలో ట్రంప్ తనతో అసభ్యంగా ప్రవర్తించారని, అడ్డుకున్నందుకు తనను హింసించారని పేర్కొనడం ఈ కేసులో నైతికతను ప్రశ్నార్థకం చేస్తోంది. గతంలోనే ఈ ఆరోపణలు చర్చకు వచ్చినప్పటికీ ఇప్పుడు అధికారిక పత్రాల రూపంలో బయటకు రావడం వాటి తీవ్రతను పెంచింది. ఈ పత్రాల విడుదలతో డెమోక్రాటిక్ పార్టీ నేతలు ఊపిరి పీల్చుకోవడం లేదు.. పైగా కత్తులు దూస్తున్నారు. ఈ ఫైళ్లను ఇన్నాళ్లూ ఎందుకు గోప్యంగా ఉంచారని వారు న్యాయశాఖను నిలదీస్తున్నారు. గత ట్రంప్ పాలనలో ఈ కేసు విచారణ ఏ విధంగా సాగిందో ఏ స్థాయిలో ప్రభావం చూపారో తెలియాలంటే పూర్తి స్థాయి విచారణ జరగాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇది కేవలం న్యాయపరమైన అంశం మాత్రమే కాదు.. ఎన్నికల వేళ ప్రత్యర్థిని ఇరుకున పెట్టడానికి దొరికిన ఒక బలమైన ఆయుధంగా డెమోక్రాట్లు భావిస్తున్నారు.

# భారత్‌కు అమెరికా అనుమతి?

### రష్యా చమురు దిగుమతికి ఓకే!.. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో నిర్ణయం?



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం కారణంగా అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితిని తగ్గించేందుకు ట్రంప్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రష్యా నుంచి ముడి చమురు దిగుమతి చేసుకునేందుకు భారత్‌కు నెల రోజుల పాటు తాత్కాలిక వెసులుబాటు కల్పించింది. అయితే, ఈ అనుమతికి కఠినమైన షరతులను విధించింది. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులను అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఆఫీస్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ జారీ చేసింది. ఈ తాత్కాలిక లైసెన్స్ ప్రకారం ఈ నెల 5వ తేదీకి ముందే నౌకల్లోకి లోడ్ చేసిన రష్యా ముడి చమురు లేదా పెట్రోలియం ఉత్పత్తుల లావాదేవీలకు మాత్రమే ఏప్రిల్ 4వ తేదీ వరకు అనుమతి ఉంటుంది. ఈ చమురును కేవలం భారత ఓడరేవులకు మాత్రమే చేర్చాలి. కొనుగోలు చేసే సంస్థలు కూడా భారత చట్టాల ప్రకారం నమోదైనవి అయి ఉండాలని ట్రెజరీ శాఖ తన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. ఈ నిర్ణయంపై అమెరికా అధికారి బాసెంట్ మాట్లాడుతూ... "అంతర్జాతీయ మార్కెట్లోకి చమురు ప్రవాహం కొనసాగేలా చూసేందుకే ఈ తాత్కాలిక 30 రోజుల మినహాయింపు ఇస్తున్నాం. ఇది కేవలం సముద్రంలో ఇప్పటికే చిక్కుకుపోయిన చమురుకు సంబంధించిన లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుంది. కాబట్టి, దీనివల్ల రష్యా ప్రభుత్వానికి పెద్దగా ఆర్థిక ప్రయోజనం చేకూరదు. భారత్ మాకు కీలక భాగస్వామి. రానున్న రోజుల్లో న్యూఢిల్లీ అమెరికా నుంచి చమురు కొనుగోళ్లను పెంచుతుందని ఆశిస్తున్నాం. ఇంధన మార్కెట్లను ఇరాన్ బందీగా మార్చే ప్రయత్నాలను అడ్డుకోవడానికే ఈ తాత్కాలిక చర్య" అని వివరించారు. ఈ మినహాయింపు కేవలం చమురు రవాణాను పూర్తి చేయడానికి అవసరమైన కార్యకలాపాలకే పరిమితం. నౌకల డాకింగ్, యాంకరింగ్, సిబ్బంది భద్రత, అత్యవసర మరమ్మతులు, బీమా, బంకరింగ్ వంటి సేవలకు ఇది వర్తిస్తుంది. ఇది రష్యాపై విధించిన ఆంక్షల సడలింపు కాదని, కేవలం పరిమితమైన, తాత్కాలిక చర్య మాత్రమేనని అమెరికా అధికారులు నొక్కిచెప్పారు. 2022లో ఉక్రెయిన్‌పై దాడి తర్వాత రష్యాపై విధించిన విస్తృత ఆంక్షలు యథాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. అలాగే, ఈ లైసెన్స్ కింద ఇరాన్‌కు సంబంధించిన ఎలాంటి లావాదేవీలకు అనుమతి లేదని చెప్పారు.

## ఇరాన్ యుద్ధ నౌకకు భారత్ ఆశ్రయం



తిరువనంతపురం: భారత తీరానికి వచ్చిన ఇరాన్ యుద్ధ నౌకకు నిలిపేందుకు అధికారులు అనుమతి ఇచ్చారు. శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనాను మూడు రోజుల క్రితం అమెరికా ముంచివేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మరో ఇరాన్ యుద్ధ నౌకకు భారత్ అనుమతి ఇచ్చిన విషయం వెలుగు చూసింది. ఐరిస్ లావన్ పేరు గల యుద్ధ నౌక కొచ్చి తీరానికి వచ్చింది. ఇది కూడా మన దేశంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు వచ్చింది. ఈ యుద్ధ నౌక తిరుగు ప్రయాణమైనప్పటికీ, మార్గమధ్యలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీనితో కొచ్చిలో దీనిని నిలిపేందుకు ఫిబ్రవరి 28న ఇరాన్ అధికారులు అనుమతి కోరారు. భారత అధికారులు మరుసటి రోజే దీనికి అనుమతి ఇచ్చినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ నౌక సహా అందులోని 183 మంది సిబ్బంది కొచ్చిలో ఆశ్రయం పొందుతున్నారు.

ఒయ్యారి చిత్రం



రుహీ సింగ్




## నేడు దురంధర్ 2 ట్రైలర్ రిలీజ్


బాలీవుడ్‌లో భారీ అంచనాలతో ఎదురుచూస్తున్న దురంధర్ 2: రివెంజ్ గురించి గత కొన్ని రోజులుగా వినిపిస్తున్న వాయిదా పుకార్లకు చివరికి క్లారిటీ వచ్చినట్టైంది. సినిమా రిలీజ్ కు మరికొన్ని రోజులే మిగిలి ఉన్నా ఎలాంటి అప్డేట్లు లేకపోవడంతో అభిమానుల్లో ఆందోళన పెరిగింది. ట్రైలర్, పాటలు, పోస్టర్లు లాంటివి ఎక్కడా కనిపించకపోవడంతో సినిమా చెప్పిన తేదీకే వస్తుందా లేదా అనే డౌట్స్ సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారి తీసాయి. అయితే ఈ సందేహాలకు ముగింపు పలుకుతూ చిత్ర యూనిట్ తాజాగా ట్రైలర్ రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. మేకర్స్ వెల్లడించిన వివరాల ప్రకారం మార్చి 7, ఉదయం 11.01 గంటలకు దురంధర్ 2 ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. ఈ అనౌన్స్‌మెంట్ తో సినిమా వాయిదా పడుతుందన్న ఊహాగానాలకు చెక్ పడినట్టైంది.

## రిజల్ట్ కావాలంటే రిస్క్ తప్పదు: రానా

ఇండియాలో ఫ్యామిలీ ఓరియెంటెడ్ సినిమాలకు ఎప్పటికీ డిమాండ్ ఉంటుందని నటుడు రానా అభిప్రాయపడ్డారు. అందుకే సంక్రాంతి సీజన్‌లో ఎన్ని ఫ్యామిలీ డ్రామాలు వచ్చినా ప్రేక్షకులు వాటిని ఆదరిస్తారని చెప్పారు. అయితే అదే సమయంలో కొత్త కథలు, కొత్త ఆలోచనలు కూడా ప్రేక్షకులు కోరుకుంటున్నారని రానా స్పష్టం చేశారు. మంచి కథలను వెతికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడమే తన టార్గెట్ అని కూడా రానా పేర్కొన్నారు. ప్రయోగాత్మక సినిమాల గురించి కూడా రానా ఆసక్తికరంగా స్పందించారు. అలాంటి సినిమాలు ఒక్కరి వల్ల రావని, చాలా మంది కలిసి పనిచేసినప్పుడే అవి సాధ్యమవుతాయని చెప్పారు. టెక్నాలజీపై కూడా తనకు ఎక్కువ ఆసక్తి ఉందని, యాక్టింగ్ వైపు వచ్చినప్పటికీ టెక్నాలజీ పరంగా తాను కొత్త విషయాలు నేర్చుకుంటూనే ఉంటానని తెలిపారు. జీవితంలో లేదా కెరీర్‌లో ముందుకు వెళ్లాలంటే రిస్క్ తీసుకోవాల్సిందేనని, మనకు ఏ విషయంలో ఆసక్తి ఉంటే దానిలో వెనక్కి తగ్గకూడదని, రిస్క్ తీసుకున్నప్పుడే రిజల్ట్ వస్తుందని ఆయన అన్నారు. ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా అనుకున్నది సాధించే వరకు పోరాడుతూనే ఉండాలని రానా చెప్పిన మాటలు ఇప్పుడు యూత్ కు పెద్ద మెసేజ్ లా మారాయి.

## శర్వా 'భోగి'.. బీడీ పొగ!

టాలీవుడ్ యంగ్ హీరో, ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ భోగి నుంచి విడుదలైన కొత్త పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న ఆ పీరియాడిక్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా శర్వానంద్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన కొత్త మాస్ లుక్ ను విడుదల చేయగా, అందరినీ ఓ రేంజ్ లో ఆకట్టుకుంటోంది. ఆ పోస్టర్ లో శర్వానంద్ పూర్తిగా భిన్నమైన అవతార్ లో కనిపిస్తున్నారు. ముదురు గడ్డంతో, చెమటలతో నిండిన ముఖం, నోటిలో బీడీ, కళ్లలో ఇంటెన్సిటీతో ఆయన లుక్ ఎంతో రఫ్ అండ్ రగ్డ్ గా కనిపిస్తోంది. ఇప్పటివరకు ఎక్కువగా క్లాసీ రోల్స్ లో కనిపించిన శర్వానంద్.. ఇప్పుడు భోగి సినిమాలో మాత్రం మాస్ రోల్ లో నెవ్వర్ బిఫోర్




అనేలా కనిపించి ప్రేక్షకులతోపాటు అభిమానులను సర్ప్రైజ్ చేయనున్నట్లు తెలుస్తోంది. సినిమాలో శర్వానంద్ గంగ అనే పవర్ ఫుల్ రోల్ లో నటిస్తున్నారు. 'నిశ్శబ్దంలో జన్మించిన తుఫాను.. విస్ఫోటనం కోసం వేచి ఉన్న కోపం' అనే ట్యాగ్ లైన్ తో విడుదల చేసిన పోస్టర్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది. త్వరలో భోగి వరల్డ్ లో గంగ కోపాన్ని చూడబోతోందని చిత్రబృందం తెలిపింది.





## అట్టహాసంగా అల్లువారింట పెళ్లి

### ఘనంగా అల్లు శిరీష్ - నయనిక రెడ్డి వివాహం

టాలీవుడ్ అగ్ర నిర్మాత అల్లు అరవింద్ తనయుడు, స్టార్ హీరో అల్లు అర్జున్ తమ్ముడు, నటుడు అల్లు శిరీష్ ఓ ఇంటివాడయ్యారు. తన బ్యాచిలర్ లైఫ్ కి గుడ్ బై చెబుతూ.. తన ప్రేయసి నయనిక రెడ్డి మెడలో మూడు ముళ్లు వేసి ఏడడుగులు వేశారు. శుక్రవారం హైదరాబాద్ లో వీరి వివాహం ఘనంగా జరిగింది. ఇరు కుటుంబ సభ్యులు, అతిథుల సమక్షంలో శిరీష్ – నయనిక జంట వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. కొల్లూరు ఐనా ఈవెంట్ స్పేస్ లో అల్లు శిరీష్ – నయనిక పెళ్లి జరిగింది. ఈ వివాహానికి చిరంజీవి, సురేఖ దంపతులతో సహా మెగా ఫ్యామిలీ సభ్యులందరూ హాజరయ్యారు. పవన్ కళ్యాణ్ – అన్నా లెజినోవా, రామ్ చరణ్ – ఉపాసన, సాయి ధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్, సుష్మిత కొణిదెల తదితరులు ఈ వేడుకలో సందడి చేశారు. సీనియర్ హీరో దగ్గుబాటి వెంకటేష్ దంపతులు, నందమూరి కళ్యాణ్ రామ్, తమిళ హీరో కార్తీ, రాశీ ఖన్నాతో సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు కూడా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. సీఎం రేవంత్ ను అల్లు అర్జున్ సాదరంగా ఆహ్వానించి, ఆప్యాయంగా పలకరించారు. ఇద్దరూ పక్కపక్కనే కూర్చొని కాసేపు ముచ్చటించారు. ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్, టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా ఈ వేడుకకు హాజరయ్యారు.



## ప్రీతీ ముకుందన్ సర్‌ప్రైజ్!

'కన్నప్ప' చిత్రంతో ప్రీతీ ముకుందన్ ఒక్కసారిగా వెలుగులోకి వచ్చిన బ్యూటీ. అప్పటికే టాలీవుడ్ లో 'ఓం బీం భుష్ 'అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చినా ఆ సినిమా రీచ్ అవ్వకపోడంతో ప్రీతీ పేరు ఎక్కడా బయటకు రాలేదు. అలాగని 'కన్నప్ప' హిట్ చిత్రం కాదు. మంచు ఫ్యామిలీ సినిమా కావడం సహా పాన్ ఇండియాలో పెద్ద ఎత్తున ప్రచారం దక్కడంతో? ప్రీతీ ముకుందన్ పేరు టాలీవుడ్ లో సంచలనంగా మారింది. నెమలి పాత్రలో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. అందం, అభినయంతో మంత్ర ముగ్ధుల్నిచేసింది. ఆ తర్వాత మళ్లీ మరో తెలుగు సినిమాలో ఛాన్స్ అందుకోలేదు. కానీ ఈ బ్యూటీ చాప కింద నీరులా బాలీవుడ్ లో కూడా విస్తరిస్తుంది. ఏకంగా ఓ సినిమా షూటింగ్ ని సైతం క్లైమాక్స్ కు తీసుకొచ్చి సర్ ప్రైజ్ చేసింది. ఇంతకీ ఏంటా సినిమా అంటే వివరాల్లోకి వెళ్లాల్సిందే. కార్తీక్ ఆర్యన్ కథానాయకుడిగా మృగ్ దీప్ సింగ్ లాంబా 'నాగ్జిల్లా' చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో హీరోయిన్లగా చాలా మంది భామల్ని పరిశీలించారు. కానీ ఎవర్ని ఎంపిక చేసారు? అన్నది మాత్రం అధికారికంగా ప్రకటించలేదు.

## నెట్‌ఫ్లిక్స్ ఏఐ విప్లవం




ప్రపంచంలోని ప్రముఖ డిజిటల్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో ఒకటైన నెట్‌ఫ్లిక్స్ హాలీవుడ్ మార్కెట్‌లో తన ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఇంట్రెస్టింగ్ ప్లాన్‌తో ముందుకు సాగుతోంది. సాంప్రదాయ స్టూడియోలను కొనుగోలు చేయడం లాంటి మార్గాలను ఎంచుకోవడం బదులుగా, కొత్త టెక్నాలజీపై దృష్టి సారిస్తూ ఏఐ ఆధారిత ఫిల్మ్ టెక్నాలజీ రంగంలో అడుగుపెడుతోంది. ఈ క్రమంలో, ప్రముఖ నటుడు మరియు డైరెక్టర్ బెన్ అఫ్లెక్స్ స్థాపించిన ఏఐ ఆధారిత ఫిల్మ్ టెక్నాలజీ కంపెనీ ఇంటర్‌పాజిటివ్ ను నెట్‌ఫ్లిక్స్ కొనుగోలు చేసినట్లు సమాచారం. ఈ డీల్ హాలీవుడ్‌లో పెద్ద టెక్నికల్ మార్పుకు నాంది పలికే అవకాశముందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. ఇంటర్‌పాజిటివ్ డెవలప్ చేసిన టెక్నాలజీ మెయిన్ గా పోస్ట్ ప్రొడక్షన్‌పై దృష్టి సారిస్తుంది.

## మనోజ్ డేవిడ్ రెడ్డి బ్యూటీ లుక్ రిలీజ్

రాకింగ్ స్టార్ మంచు మనోజ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం డేవిడ్ రెడ్డి. దర్శకుడు హనుమరెడ్డి యక్కంటి తెరకెక్కిస్తున్న ఆ మూవీ స్వాతంత్ర్యానికి ముందు జరిగిన సంఘటనల నేపథ్యంతో పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఓ ధైర్యవంతుడైన యోధుడి కథను సినిమాలో చూపించనున్నారు. అయితే సినిమాలో హీరోయిన్ గా కోలీవుడ్ చిత్రం ప్రిన్స్ ద్వారా మంచి గుర్తింపు పొందిన నటి మరియా ర్యబోషప్క నటిస్తోంది. తాజాగా ఆమె ఫస్ట్ లుక్ ను మేకర్స్ సోషల్ మీడియాలో విడుదల చేశారు. అందులో మరియా స్పెషల్ డ్రెస్, క్యాప్ ధరించి వింటేజ్ కార్ ముందు నిల్చున్నట్లు కనిపించారు.

## ఇప్పుడు బాధపడుతున్నా

బాలీవుడ్ లో భూమీపడ్నేకర్ కెరీర్ ఎలా ఎదిగిందన్నది చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీలో ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా అంచలంచెలుగా ఎదిగిన నటి. తన సొంత ప్రతిభతో ఇండస్ట్రీ పోటిని తట్టుకుని నిలబడిన నటి. భూమీ పడ్నేకర్ నేరుగా హీరోయిన్ అవ్వలేదు. తెర వెనుక నుండి తెర ముందుకు వచ్చిన నటి. ప్రముఖ నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిల్మ్స్ లో కాస్టింగ్ డైరెక్టర్ షాను శర్మ వద్ద అసిస్టెంట్‌గా ప్రారంభమైంది. సుమారు ఆరేళ్ల పాటు అసిస్టెంట్ గానే కొనసాగింది. అలా ఎంతో మందిని తన చేతుల మీదుగా వెండి తెరకు ఎంపిక చేసింది. అలా ఓ సందర్భంలోనే ఓ ఆడిషన్ లో తానే హీరోయిన్ గా అనుకోకుండా సెలక్ట్ అయింది. అదే అమ్మడి కెరీర్ కు టర్నింగ్ పాయింట్. అప్పటి నుంచి బాలీవుడ్ లో వెనక్కి తిరిగి చూడకుండా సాగిపోతుంది. నాటి నుంచి నేటి వరకూ ఎన్నో వైవిధ్యమైన పాత్రలు, ప్రయోగాత్మక చిత్రాల్లో కనిపించి తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ ను సంపాదిం చుకుంది. సహజంగా చాలా మంది హీరోయిన్లు మొదటి సినిమాలో అందంగా, గ్లామరస్‌గా కనిపించాలని కోరుకుంటారు. కానీ భూమి పెడ్నేకర్ తన మొదటి సినిమా –దమ్ లగా కే హైషా– కోసం ఏకంగా 30 కిలోల బరువు పెరిగింది. ఒక మధ్య తరగతి కుటుంబంలో లావుగా ఉండే అమ్మాయి పాత్రను ఒప్పుకోవడం ఎంతో ఆసక్తికరమైంది. ఆ రిస్క్ ఆమెకు ఫిల్మ్ ఫేర్ అవార్డు సహా ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. అలాగే వెండి తెరపై అంతే బోల్డ్ గానూ నటించింది. ఇంటిమేట్ సన్నివేశాల్లో ఏనాడు రాజీ పడింది లేదు. కంటెంట్ డిమాండ్ మేరకు హద్దులు లేకుండా చాలా సినిమాల్లో నటించింది.



## అభిషేక్ పుంజుకుంటాడు

సెమీస్‌లో గెలిచి టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌కు భారత్ చేరుకోవడంలో సంజు శాంసన్, జస్‌ప్రీత్ బుమ్రా కీలక పాత్ర పోషించారు. తొలుత బ్యాటింగ్‌లో అదరగొట్టిన సంజు టీమ్ ఇండియాకు భారీ స్కోరు అందించాడు. లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ దూకుడుకు జస్‌ప్రీత్ బుమ్రా తన పదునైన బౌలింగ్‌తో కళ్లెం వేశాడు. ఇక ఈ మ్యాచ్‌లోనూ అభిషేక్ శర్మ (9) మరోసారి నిరాశపరిచాడు. ఈ ముగ్గురిపై క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ తనదైన శైలిలో విశ్లేషణ చేశారు. 'జస్‌ప్రీత్ బుమ్రా ప్రపంచంలోనే టాప్ బౌలర్ అని భావిస్తున్నా. అతడి గురించి ఎంత చెప్పినా సరిపోదు. తీవ్ర ఒత్తిడిలోనూ ఎలాంటి ప్రదర్శన ఇచ్చాడో మనం చూశాం. దేశంలోని ప్రతి క్రికెట్ అభిమాని ప్రేమ, గౌరవానికి అతడు అర్హుడు. ఇక సంజు శాంసన్ బ్రిలియంట్ క్రికెటర్. కొన్నిసార్లు పెద్ద ప్లేయర్లకూ కష్టాలు తప్పవు. వాటిని



ఎదుర్కొని ముందుకు సాగాలి. ఆ పరిస్థితులను అనుభవించిన సంజు శాంసన్ తన ఫామ్‌ను అందుకొన్నాడు. గత రెండు మ్యాచుల్లో అతడి బ్యాటింగ్ ప్రదర్శన అద్భుతం. అభిషేక్ శర్మ ఇప్పుడు ఇలాంటి స్థితిలోనే ఉన్నాడు. అతడి స్ఫూర్తితో అభిషేక్ ఫైనల్ మ్యాచ్‌లో తప్పకుండా రాణిస్తాడని అనుకుంటున్నా. ఇది టీమ్ గేమ్. వ్యక్తిగత ప్రదర్శన ముఖ్యమే కానీ.. జట్టుగా విజయాలు సాధించడం అంతకంటే ముఖ్యం. ఇప్పుడు టీమ్‌ఇండియా ఇదే చేస్తోంది. ఫైనల్‌లోనూ గెలిచి విజేతగా నిలవాలని ఆకాంక్షిస్తున్నా' అని కపిల్ వెల్లడించారు.



### మ్యాచ్ వివరాలు:

వేదిక: నరేంద్ర మోదీ స్టేడియం, అహ్మదాబాద్
లైవ్ స్ట్రీమింగ్: జియో హాట్‌స్టార్
టీవీ బ్రాడ్‌కాస్ట్: స్టార్ స్పోర్ట్స్
అంపైర్లు: రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్ (ఇంగ్లండ్), అలెక్స్ వార్ఫ్ (ఇంగ్లండ్), అల్లాహుదీన్ పాలేకర్ (దక్షిణాఫ్రికా)
మ్యాచ్ రిఫరీ: ఆండీ పైక్రాఫ్ట్ (జింబాబ్వే)





# ఇలాగైతే గెలుస్తామా?

## సెమీస్‌లో ఆపసోపాలు.. భారీ లక్ష్యాన్ని కాపాడుకోనేందుకు కష్టాలు

### ఫాంలో లేని అభిషేక్ శర్మ.. మిస్టరీ స్పిన్నర్ పేలవ ప్రదర్శన

### టచ్‌లోకి రాని కెప్టెన్ సూర్య.. ఈ బౌలింగ్‌తో గెలవడం సాధ్యమేనా?

(ఈవార్తలు క్రీడావిభాగం)

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో టీమిండియా ఫైనల్‌కు దూసుకెళ్లింది. వాంఖడే వేదికగా గురువారం ఉత్కంఠగా సాగిన సెమీఫైనల్లో టీమిండియా 7 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై గట్టెక్కింది. 254 పరుగుల భారీ లక్ష్యాన్ని కాపాడుకునేందుకు భారత్ ఆపసోపాలు పడింది. జాకోబ్ బెతెల్ విధ్వంసకర శతకంతో టీమిండియా వెన్నులో వణుకు పుట్టించాడు. దాంతో ఈ మ్యాచ్ గెలిచినా.. ఫైనల్లో అడుగుపెట్టినా.. గెలిచిన తీరు మాత్రం సంతృప్తినివ్వడం లేదు. ఎందుకంటే 254 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ 100 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. దాంతో ఈ మ్యాచ్ ఏకపక్షమే అని అంతా అనుకున్నారు. కానీ భారత స్పిన్నర్లపై సిక్సర్లతో విరుచుకుపడిన జాకోబ్ బెతెల్ ఒక్కసారిగా మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసాడు. విల్ జాక్స్‌తో కలిసి అతను చెలరేగిన తీరుతో ఇంగ్లండ్ విజయం లాంఛనమేనని అభిప్రాయం కలిగింది. అక్షర్ పటేల్ స్టన్నింగ్ క్యాచ్‌తో విల్ జాక్స్ వెనుదిరిగినా.. 77 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరదించినా.. విజయంపై భారత్‌కు భరోసా లేదు. బుమ్రా 18వ ఓవర్ వేయడానికి ముందు వరకు విజయంపై ధీమా లేదు. ఓటమి భయమే ఎక్కువగా కనిపించింది. మన బౌలింగ్ డొల్లతనాన్ని ఈ మ్యాచ్ బట్టబయలు చేసింది. బుమ్రాను మినహాయిస్తే.. మరే బౌలర్ రాణించలేకపోయాడు. దాంతో ఎవరికి ఓవర్ ఇస్తే ఏమవుతుందో అని కంగారు పడే పరిస్థితి కనిపించింది. ఈ ప్రపంచకప్ ముందు వరకు ప్రత్యర్థి బ్యాటర్లు ఛేదించలేని మిస్టరీ స్పిన్నర్‌గా కనిపించిన వరుణ్ చక్రవర్తి... గత నాలుగు మ్యాచ్‌ల్లో తేలిపోయాడు. ముఖ్యంగా ఈ సెమీస్‌లో మరీ దారుణంగా 64 పరుగులు సమర్పించుకున్నాడు. వరుణ్ కెరీర్‌లోనే ఇంతలా పరుగులిచ్చుకోవడం ఇదే తొలిసారి. పేలవ ఫామ్‌లో ఉన్న జోస్ బట్లర్‌ను బౌల్డ్ చేయడం తప్పితే అతను ఈ మ్యాచ్‌లో రాణించింది లేదు. అతను వేసే ప్రతీ బంతి అభిమానుల వెన్నులో వణుకు పుట్టించింది. అక్షర్ పటేల్ సైతం ప్రభావం చూపలేకపోయాడు. అర్ష్‌దీప్ సింగ్ తేలిపోయాడు. ఎంతలా అంటే అదుపు తప్పి పదే పదే వైడ్స్ సంధించాడు. ఆరంభంలో కట్టడిగా వేసిన హార్దిక్ పాండ్యా.. జాకోబ్ బెతెల్ ధాటికి లయ తప్పాడు. ఒక్క బుమ్రా తప్ప మరే బౌలర్ ప్రభావం చూపలేకపోయారు. శివమ్ దూబే గురించి చెప్పుకోవడం అనవసరం. ఆఖరి ఓవర్‌లో 30 పరుగులు డిఫెండ్ చేయాల్సిన పరిస్థితుల్లోనూ అతను 21 పరుగులిచ్చుకున్నాడు. జాకోబ్ బెతెల్ రనౌట్ కాకుంటే.. దూబే బౌలింగ్‌ను అతను చీల్చి చెండాడేవాడు. బుమ్రా చివరి రెండు ఓవర్లలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఈ మ్యాచ్‌లో భారత్ గట్టెక్కింది లేదంటే.. ఓటమి తప్పేది కాదు. జట్టులో బుమ్రా తరహా ఇంకో నమ్మదగ్గ బౌలర్ లేకపోవడం భారత జట్టు బలహీనతను బయటపెట్టింది. అంతేకాకుండా ఎక్స్ బౌలర్ ఆప్షన్‌గా శివమ్ దూబేను నమ్మలేని పరిస్థితి నెలకొంది. ఏ బౌలర్ అయిన మ్యాచ్ మధ్యలో గాయపడితే పరిస్థితి ఏంటి? అనేది ఆందోళనగా మారింది. ఈ బౌలింగ్‌తో పటిష్టమైన న్యూజిలాండ్‌తో ఫైనల్లో గెలవడం కష్టమనే అభిప్రాయం కలుగుతోంది. న్యూజిలాండ్ జట్టులో ఫిన్ అలెన్ టీమ్ సీఫెర్ట్ వంటి విధ్వంసకారులున్నారు. వీరిని భారత బౌలర్లు ఏ మేర అడ్డుకుంటారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.



# ఫైనల్ రద్దయితే..!

ఐసీసీ టీ20 ప్రపంచకప్‌ను నిలబెట్టుకునేందుకు డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియా అడుగు దూరంలో నిలిచింది. వరుసగా రెండోసారి ఫైనల్ చేరింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఇంగ్లండ్‌తో గురువారం వాంఖడే వేదికగా ఉత్కంఠగా సాగిన పోరులో భారత్ 7 పరుగుల తేడాతో గట్టెక్కింది. ఈ విజయంతో అహ్మదాబాద్ వేదికగా ఆదివారం జరిగే ఫైనల్లో న్యూజిలాండ్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్, న్యూజిలాండ్ జట్లు తలపడటం ఇదే తొలిసారి. ఈ ఫైనల్ మ్యాచ్‌కు ఎలాంటి వర్ష సూచన లేకున్నా.. ఈ మ్యాచ్ రద్దయితే పరిస్థితి ఏంటి? ఐసీసీ రూల్స్ ఎలా ఉన్నాయనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. అయితే ఈ ఫైనల్ మ్యాచ్‌కు మార్చి 9(సోమవారం)ని ఐసీసీ రిజర్వ్ డేగా కేటాయించింది. ఫైనల్ జరిగే ఆదివారం(మార్చి 8) వర్షం పడితే.. రిజర్వ్ డే అయిన మరుసటి రోజు ఆడిస్తారు. ముందుగా నిర్ణయించిన రోజున కనీస ఓవర్ల ఆట కూడా సాధ్యం కాకపోతే.. మ్యాచ్‌ను రిజర్వ్ డే రోజు ఫ్రెష్‌గా నిర్వహిస్తారు. ఒకవేళ మొదటి రోజు ఆట ప్రారంభమై మధ్యలో నిలిచిపోతే.. రిజర్వ్ డేన ఎక్కడైతే ఆట ఆగిపోయిందో అక్కడి నుంచే మ్యాచ్ కొనసాగుతుంది. మ్యాచ్‌ను తొలి రోజు పూర్తి చేయడానికి అంపైర్లు ప్రయత్నిస్తారు. ఇందుకోసం షెడ్యూల్ సమయం కంటే అదనంగా 120 నిమిషాల (2 గంటలు) సమయాన్ని కేటాయిస్తారు. సాధారణ గ్రూప్ దశ మ్యాచ్‌ల్లో ఫలితం కోసం ఇరు జట్లు కనీసం 5 ఓవర్లు ఆడాలి. కానీ సెమీఫైనల్, ఫైనల్ వంటి నాకౌట్ మ్యాచ్‌ల్లో ఫలితం తేలాలంటే రెండు జట్లు కనీసం 10 ఓవర్ల చొప్పున బ్యాటింగ్ చేయాలి. ఒకవేళ మ్యాచ్ పూర్తయి.. టై అయితే విజేతను తేల్చడానికి సూపర్ ఓవర్ నిర్వహిస్తారు. సూపర్ ఓవర్ కూడా టై అయితే.. ఫలితం తేలే వరకు వరుసగా సూపర్ ఓవర్లు నిర్వహిస్తారు. సూపర్ ఓవర్లు ఆడించలేని పరిస్థితి నెలకొంటే ఇరు జట్లను విజేతగా ప్రకటిస్తారు. ఒకవేళ భారీ వర్షం లేదా ఇతర కారణాల వల్ల నిర్ణీత రోజు, రిజర్వ్ డే.. రెండు రోజుల్లో కూడా కనీసం 10 ఓవర్ల ఆట సాధ్యం కాకపోతే.. ఐసీసీ నిబంధనల ప్రకారం ఇరు జట్లను ఉమ్మడి విజేతగా ప్రకటిస్తారు. సెమీఫైనల్స్‌లో అయితే పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న జట్టును విజేతగా ప్రకటిస్తారు. కానీ ఫైనల్ రద్దయితే మాత్రం రెండు జట్లను విజేతలుగా ప్రకటించి ట్రోఫీని అందజేస్తారు.

## ఏకైక టెస్టులో పేలవంగా!

### ఆస్ట్రేలియాతో టెస్టు మ్యాచ్

**భారత మహిళల పేలవ ప్రదర్శన**

పెర్త్ వేదికగా పింక్ బాల్ టెస్టులో ఆస్ట్రేలియా – భారత మహిళా జట్లు తలపడుతున్నాయి. తొలి రోజు ఆట ముగిసేసరికి ఆసీస్ 3 వికెట్ల నష్టానికి 97 పరుగులు చేసింది. క్రీజులో పెర్రీ (43), అన్నాబెల్ సదర్లాండ్ (20) ఉన్నారు. ఓపెనర్ జార్జియా వోల్ (2), ఫోయబ్ లిట్చ్‌ఫీల్డ్ (9), హీలే (13) విఫలమయ్యారు. భారత బౌలర్లలో సయాలి 2, క్రాంతి గౌడ్ ఒక వికెట్ తీశారు. హీలే ఇచ్చిన క్యాచ్‌ను జెమీమా అద్భుతంగా ఒడిసిపట్టింది. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకు ఆలౌటైంది. దీంతో ఆసీస్ ఇంకా 102 పరుగులు వెనుకబడి ఉంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు శుభారంభం దక్కలేదు. స్టార్ బ్యాటర్ స్మృతి మందాన (4) విఫలమైంది. షెఫాలీ వర్మ (35), ప్రతీకా



రావల్ (18) కాసేపు ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లారు. అయితే, స్వల్ప వ్యవధిలో వారిద్దరూ ఔట్ కావడంతో భారత్ ఇబ్బందుల్లో పడింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (19), దీప్తి శర్మ (7), రిచా ఘోష్ (11), స్నేహ్ రాణా (5) పెద్దగా ప్రభావం చూపించలేదు. వరుసగా వికెట్లు పడుతున్నా సరే.. జెమీమా రోడ్రిగ్స్ (52) నిలకడగా ఆడింది. ఈ క్రమంలో టెస్టు కెరీర్‌లో నాలుగో హాఫ్ సెంచరీని పూర్తి చేసుకుంది. ఆసీస్ బౌలర్ అన్నాబెల్ సదర్లాండ్ (4/46) విజృంభణతో మరోసారి భారత్ ఇన్నింగ్స్ తడబడింది. ఆఖర్లో కాశ్వీ గౌతమ్ (34) అజేయంగా నిలిచింది. సదర్లాండ్ 4, హమిల్టన్ 3, బ్రౌన్ 2, గార్డెనర్ ఒక వికెట్ తీశారు.

## మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు బుమ్రానే అర్హుడు: సంజూ

టీ20 వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్లో ఇండియా ఉత్కంఠ విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. పరుగుల ప్రవాహం సృష్టించిన ఆ మ్యాచ్‌లో ఇండియా ఏడు పరుగుల తేడాతో నెగ్గింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఇండియా ఏడు వికెట్ల నష్టానికి 253 రన్స్ చేసింది. అయితే బ్యాటర్ సంజూ శాంసన్కేవలం




42 బంతుల్లో 89 రన్స్ చేసి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వాంఖడే స్టేడియంలో బౌండరీల మోత మోగించాడు. అతని ఇన్నింగ్స్‌లో 8 ఫోర్లు, ఏడు సిక్సర్లు ఉన్నాయి. నువ్వా నేనా అన్నట్లుగా సాగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఆఖరి వరకు పోరాడింది. ఇంగ్లండ్ ఏడు వికెట్ల నష్టానికి 246 రన్స్ చేసి ఏడు పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఇంగ్లండ్ బ్యాటర్ బేథెల్ సూపర్ సెంచరీ కొట్టాడు. 48 బంతుల్లో 8 ఫోర్లు, ఏడు సిక్సర్లతో 105 రన్స్ చేసి ఔటయ్యాడు. అయితే భారత్ ఇన్నింగ్స్‌లో అత్యధిక రన్స్ చేసిన సంజూ శాంసన్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. ఆ అవార్డు అందుకున్న తర్వాత సంజూ మాట్లాడుతూ.. ఈ అవార్డు తనకు దక్కాల్సింది కాదన్నారు. భారత జట్టు విజయంలో బౌలర్ బుమ్రా కీలక పాత్ర పోషించినట్లు పేర్కొన్నారు. గెలుపు క్రెడిట్ బుమ్రాకే దక్కుతుందని, అతనో ప్రపంచ మేటి బౌలర్ అని, తరానికి ఓసారి అలాంటి ఆటగాడు దొరుకుతారని, సెమీస్ మ్యాచ్‌లో అద్భుతంగా బౌలింగ్ చేశాడని, ఈ అవార్డు వాస్తవానికి ఆయనకే దక్కాలని అన్నారు. డెత్ ఓవర్లలో బుమ్రా వేసిన బౌలింగ్ తీరు ప్రత్యేకమైందని, ఒకవేళ అలా బౌలింగ్ చేయకుంటే, బహుశా తాను ఇక్కడ నిలబడేవాడిని కాదన్నారు. ఈ విజయంలో బౌలర్లకే క్రెడిట్ దక్కుతుందన్నారు. కఠినమైన పరిస్థితుల్లో ఉత్తమంగా రాణించారన్నారు. ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో బుమ్రా యార్కర్లతో ఇంగ్లండ్ బ్యాటర్లను అడ్డుకున్నాడు. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి తక్కువ పరుగులు ఇచ్చాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
శనివారం 7-3-2026
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# బాల్యం 'లైక్'లకు బందీ కావొద్దు

ఆధునిక యుగంలో స్మార్ట్‌ఫోన్ అరచేతిలోకి వచ్చాక ప్రపంచం చిన్నదైపోయింది నిజమే కానీ, అదే సమయంలో చిన్నారుల అమాయకత్వం ఆ నిలువుటద్దంలో బందీ అవుతోంది. 16 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారికి సోషల్ మీడియా వాడకాన్ని నిషేధించడం లేదా కఠిన నియంత్రణలు విధించడం అనేది కేవలం సాంకేతికపరమైన నిర్ణయం కాదు; అది ఒక తరపు మానసిక ఆరోగ్యాన్ని కాపాడే రక్షక కవచం. పదహారేళ్ల వయస్సు అనేది శారీరక, మానసిక మార్పుల కాలం. ఈ వయస్సులో పిల్లలు ఇతరులతో తమను తాము పోల్చుకోవడం ఎక్కువ. ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్ వంటి వేదికల్లో కనిపించే ఫిల్టర్డ్ అందాలు, కృత్రిమ జీవనశైలిని చూసి నిజం అనుకోవడం వల్ల చిన్నారుల్లో న్యూనతాభావం, ఆందోళన, కుంగుబాటు పెరుగుతున్నాయి. అల్గారిథమ్స్ ఇచ్చే డోపమైన్ కిక్కుకు లోనై, వారు ఒక రకమైన డిజిటల్ వ్యసనానికి గురవుతున్నారు. సైబర్ బుల్లీయింగ్ (వేధింపులు), ఆన్‌లైన్ వేటగాళ్లు, అనవసరపు సున్నితమైన కంటెంట్ నేరుగా వారి కళ్లముందు ప్రత్యక్షమవుతోంది. ఈ వయస్సులో ఏది సరైనదో, ఏది కాదో తేల్చుకునే పరిపక్వత ఉండదు. లైక్‌లు, వ్యూస్ కోసం ప్రాణాలకు తెగించి చేసే 'ఛాలెంజ్‌లు' ఎందరో ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం లేదా సామాజిక సంస్థలు నిషేధం వైపు అడుగులు వేయడం ఆహ్వానించదగ్గ మార్పు. నిషేధం ఒక్కటే సరిపోదు. పిల్లలకు డిజిటల్ అక్షరాస్యతతో పాటు, ప్రకృతితో మమేకమయ్యేలా చూడటం, మైదానాల్లో ఆటలకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి మార్పులు తల్లిదండ్రుల నుంచే మొదలవ్వాలి. సోషల్ మీడియా సంకెళ్ల నుంచి విముక్తి లభిస్తేనే, భావి భారత పౌరుల ఆలోచనా శక్తి, సృజనాత్మకత సహజంగా వికసిస్తాయి. బాల్యం అంటే తెరపై బొమ్మలు చూడటం కాదు.. తోటి పిల్లలతో కలిసి ఆడుకోవడం, లోకాన్ని కళ్లతో చూడటం. ఈ దిశగా సాగే ఏ ప్రయత్నమైనా సమాజ ఆరోగ్యానికి శుభసూచకమే.



నిన్న కరగని కమ్మని కలవు..
నేడు సంద్రాన ఎగిసిపడే అలవు..

నిన్న వంటగది
సరిహద్దుల్లో ఒదిగిన హరిణివి..
నేడు విశ్వాన్ని చుట్టే అశ్వానివి..

నిన్న ఇంట ముంగిట
మొలిచిన తులసి మొక్కవు..
నేడు కోర్కెలు తీర్చే కల్పవల్లివి..

నిన్న పంజరంలో
బందీవైన విహంగానివి..
నేడు అంతరిక్షాన్ని
శోధించే మేధో తరంగానివి..

నిన్న సాదాసీదా ఆడపిల్లవు..
నేడు చీకటిని దహించే అగ్గిపుల్లవు..

నిన్న గుట్టుగా బ్రతికే గృహిణివి..
నేడు సామ్రాజ్యాలను
ఏలే బిజినెస్ మాగ్నెట్‌వి..

నిన్న మౌన వీణలో
పలకని రాగానివి..
నేడు అన్యాయంపై గర్జించే
విప్లవ శంఖారావానివి..

నిన్న అబలన్న
పదానికి చరమగీతానివి..
నేడు సాక్షాత్తూ
ఆదిపరాశక్తికి ప్రతిరూపానివి..

జయహో.. జయహో..
ఓ నవభారత నారీమణి..! జయహో

## నవభారత నారీమణికి.. నా అక్షర నీరాజనం..!



- పోలయ్య కూకట్లపల్లి, 9110784502
(కవి రత్న, సాహిత్య ధీర, సహస్ర కవి భూషణ్)

# విద్యా రంగంలో ఏఐతో జాగ్రత్త

సాంకేతికత మానవ జీవితంలో ఒక అంతర్భాగంగా మారిపోయింది. ముఖ్యంగా కృత్రిమ మేధ ప్రవేశంతో విద్యార్థుల అభ్యసన ప్రక్రియలో పెనుమార్పులు సంభవిస్తున్నాయి. ఒకప్పుడు సమాచారం కోసం పుస్తకాలపై ఆధారపడిన విద్యార్థి, నేడు ఒక్క క్లిక్‌తో ఏ విషయాన్నైనా లోతుగా తెలుసుకోగలుగుతున్నాడు. అయితే, ఈ సాంకేతిక విప్లవం మన విద్యా వ్యవస్థకు వరమా లేక శాపమా అనే చర్చ ఇప్పుడు ముదురుతోంది. ఏఐ ద్వారా విద్యార్థులకు 'పర్సనలైజ్డ్ లెర్నింగ్' (వ్యక్తిగత అభ్యసనం) సాధ్యమవుతోంది. ప్రతి విద్యార్థి గ్రహణ శక్తి ఒకేలా ఉండదు. ఏఐ టూల్స్ విద్యార్థి స్థాయిని బట్టి పాఠాలను బోధించగలవు. ఇది ఉపాధ్యాయులకు కూడా భారంగా ఉన్న పనులను సులభతరం చేస్తూ, వారు బోధనపై ఎక్కువ దృష్టి పెట్టేలా చేస్తోంది.



రణధీర్ గుండు
టెకీ, హైదరాబాద్



సంక్లిష్టమైన విజ్ఞాన శాస్త్ర ప్రయోగాలు, చారిత్రక ఘట్టాలను విజువలైజేషన్ ద్వారా అర్థం చేసుకోవడంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తోంది. మరోవైపు, చాట్ జీపీటీ వంటి ఏఐ సాధనాల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచనలు తగ్గుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. హోంవర్క్‌లు, అసైన్‌మెంట్‌ల కోసం విద్యార్థులు పూర్తిగా ఏఐపై ఆధారపడుతుండటంతో, సొంతంగా ఆలోచించే శక్తి మందగిస్తోంది. అంతేకాకుండా, ఇంటర్నెట్‌లో లభించే సమాచారం ఎల్లప్పుడూ ఖచ్చితమైనది కాకపోవచ్చు. ఇది తప్పుడు సమాచార వ్యాప్తికి దారితీసే ప్రమాదం ఉంది. ఏ సాంకేతికత అయినా ఒక సాధనం మాత్రమే, అది లక్ష్యం కాకూడదు. కృత్రిమ మేధను విజ్ఞాన సముపార్జనకు ఒక తోడ్పాటుగా ఉపయోగించుకోవాలే తప్ప, మేధస్సుకు ప్రత్యామ్నాయంగా మార్చుకోకూడదు. విద్యా సంస్థలు కూడా కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు 'నైతిక ఏఐ వినియోగం'పై అవగాహన కల్పించాలి. ఉపాధ్యాయుడి స్థానాన్ని ఏ యంత్రమూ భర్తీ చేయలేదు, కానీ ఏఐని అందిపుచ్చుకున్న ఉపాధ్యాయుడే భవిష్యత్తును నిర్మించగలడు.

సాంకేతికత మానవ మేధస్సుకు పదును పెట్టాలి కానీ, అది మేధస్సుకే ప్రత్యామ్నాయం కాకూడదు. నేడు విద్యావ్యవస్థలో కృత్రిమ మేధ అడుగుపెట్టిన తీరు అద్భుతంగా ఉన్నప్పటికీ, అది విద్యార్థుల సహజమైన సృజనాత్మకతను హరించివేస్తుందన్న ఆందోళనలు ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు విద్యార్థి తన మెదడుకు పదును పెట్టి రాసే వ్యాసాలు, చేసే ప్రాజెక్టులు నేడు ఒక్క 'ప్రాంప్ట్'తో సెకన్ల వ్యవధిలో సిద్ధమైపోతున్నాయి. ఈ సులభతరం వెనుక దాగి ఉన్న ప్రమాదాన్ని గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. సృజనాత్మకత అనేది నిరంతర సాధన, తప్పులు చేయడం, మరియు ఆ తప్పుల నుండి నేర్చుకోవడం ద్వారా అలవడుతుంది. అయితే ఏఐ సాధనాలు లోపరహితమైన సమాచారాన్ని వెంటనే అందించడం వల్ల విద్యార్థులు 'ప్రయత్నం' చేయడమే మానేస్తున్నారు. హోంవర్కులు, అసైన్‌మెంట్ల కోసం చాట్ జీపీటీ వంటి సాధనాలపై అతిగా ఆధారపడటం వల్ల విద్యార్థుల్లో స్వతంత్రంగా ఆలోచించే శక్తి మందగిస్తోంది. మేధోమథనం చేయాల్సిన చోట కేవలం కాపీ-పేస్ట్ సంస్కృతి పెరిగిపోతోంది. ఏఐ అందించే సమాచారాన్ని గుడ్డిగా నమ్మడం వల్ల విద్యార్థులు అందులోని సత్యాసత్యాలను విశ్లేషించే సామర్థ్యాన్ని కోల్పోతున్నారు. ఇది కేవలం విద్యాపరమైన నష్టమే కాదు, భవిష్యత్తులో సరైన నిర్ణయాలు తీసుకోలేని బలహీనమైన తరానికి దారితీసే అవకాశం ఉంది. పాఠశాలలు మరియు విశ్వవిద్యాలయాలు ఇప్పటికే ఏఐ ద్వారా రూపొందించిన అసైన్‌మెంట్లను గుర్తించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్లను ఆశ్రయిస్తున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. విద్య అనేది కేవలం సమాచారాన్ని సేకరించడం కాదు, అది ఒక వ్యక్తిత్వ వికాసం. ఉపాధ్యాయుడు మరియు విద్యార్థి మధ్య ఉండే భావోద్వేగ అనుబంధం, ఉపాధ్యాయుడి ప్రోత్సాహం విద్యార్థిలో సృజనాత్మకతను మేల్కొల్పుతాయి. ఏఐ యంత్రం సమాచారాన్ని ఇవ్వగలదు కానీ, విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి అతనికి స్ఫూర్తిని ఇవ్వలేదు. ఏఐపై అతిగా ఆధారపడటం వల్ల తరగతి గదిలో ఉండాల్సిన చర్చలు, సామాజిక పరస్పర చర్యలు తగ్గిపోతున్నాయి.

ఏఐని పూర్తిగా నిషేధించడం పరిష్కారం కాదు, దాన్ని ఎలా ఉపయోగించాలో నేర్పించడం కీలకం. ఏఐని సమాచార సేకరణకు ఒక 'సహాయక సాధనం'గా చూడాలే తప్ప, దాన్ని మేధస్సుకు ప్రత్యామ్నాయంగా మార్చుకోకూడదు. కేవలం రాతపూర్వక అసైన్‌మెంట్లకే పరిమితం కాకుండా, విద్యార్థుల సమక్షంలో జరిగే చర్చలు, ప్రాక్టికల్ ప్రయోగాలు మరియు మౌఖిక పరీక్షలకు ప్రాధాన్యం ఇవ్వాలి. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఏఐని నైతికంగా ఎలా ఉపయోగించాలో అవగాహన కల్పించాలి. కృత్రిమ మేధస్సు అనేది అగ్ని వంటిది. దాన్ని పద్ధతిగా వాడితే వంట అవుతుంది, అతిగా వాడితే ఇల్లు తగలబడుతుంది. విద్యార్థులు తమ మేధస్సుకు 'ఎడిటర్ ఇన్ చీఫ్'గా వ్యవహరించాలే తప్ప, ఏఐకి బానిసలు కాకూడదు. మన విద్యార్థులు భవిష్యత్తులో కేవలం యంత్రాలను నడిపేవారిగా కాకుండా, కొత్త యంత్రాలను సృష్టించే సృజనాత్మక మేధావులుగా ఎదగాలి.

# రాజ్యాంగ స్ఫూర్తికి పరీక్ష కాలం

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో గవర్నర్ పదవి అత్యంత గౌరవప్రదమైనది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వారధిగా, రాష్ట్ర రాజ్యాంగ అధినేతగా గవర్నర్ వ్యవహరించాలి. అయితే, ఇటీవలి కాలంలో వివిధ రాష్ట్రాల్లో గవర్నర్లు, ఎన్నికైన ప్రభుత్వాల మధ్య పెరుగుతున్న ఘర్షణలు ఈ వ్యవస్థపై కొత్త చర్చకు దారితీస్తున్నాయి. గడిచిన కొద్ది నెలలుగా తమిళనాడు, కేరళ, కర్ణాటక, బెంగాలల్ వంటి రాష్ట్రాల్లో గవర్నర్లు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను పెండింగ్‌లో పెట్టడం లేదా వెనక్కి పంపడంపై సుప్రీంకోర్టు సైతం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ముఖ్యంగా విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో, గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ "ఏజెంట్లు"గా వ్యవహరిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇటీవలే తెలంగాణ, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకం, బదిలీలు జరగడం గమనార్హం. ఆర్టికల్ 163: రాజ్యాంగం ప్రకారం, గవర్నర్ తన విధులను ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రిమండలి సలహా మేరకు నిర్వహించాలి. అసెంబ్లీ పంపిన బిల్లులపై గవర్నర్ అభ్యంతరాలు వ్యక్తం చేయవచ్చు, కానీ రెండోసారి అసెంబ్లీ అదే బిల్లును పంపితే దానికి ఆమోదం తెలపడం రాజ్యాంగబద్ధమైన విధి. గవర్నర్ ఒకవైపు రాష్ట్రానికి ప్రథమ పౌరుడిగా, మరోవైపు కేంద్రం ప్రతినిధిగా సమతుల్యతను పాటించాలి. కానీ, రాజకీయ నేపథ్యం ఉన్న వ్యక్తులను గవర్నర్లుగా నియమించడం వల్ల వారు తమ పూర్వాశ్రమ వాసనలు వదిలిపెట్టలేక పోతున్నారనే విమర్శ ఉంది. శాసనసభ ప్రసంగాల్లో ప్రభుత్వం రాసిచ్చిన అంశాలను చదవకుండా దాటవేయడం లేదా మధ్యలోనే సభ నుంచి వెళ్ళిపోవడం వంటి చర్యలు రాజ్యాంగ సంప్రదాయాలకు విరుద్ధమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గవర్నర్ పదవి కేవలం అలంకారప్రాయమైనది కాదు, అలాగని అది సమాంతర అధికార కేంద్రం కూడా కాకూడదు. సర్కారియా కమిషన్, పుంఛీ కమిషన్ సూచించినట్లుగా, గవర్నర్లు నిష్పక్షపాతంగా వ్యవహరించినప్పుడే సమాఖ్య వ్యవస్థ బలోపేతం అవుతుంది. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటం అనేది పదవిలో ఉన్న వ్యక్తుల బాధ్యత మాత్రమే కాదు, ప్రజాస్వామ్య మనుగడకు కూడా అత్యవసరం. దీన్ని గ్రహించి గవర్నర్లు ప్రజలకు సుపరిపాలన అందించే దిశగా ఆలోచనలు చేయాలి.




- రాజ్యం సురవందిత, టీచర్, గుంటూరు

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.